జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శనివారం 7 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :293 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏజెన్సీ/కరస్పాండెంట్ మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం, ఋతువు: శరద్ ఋతువు, ఆయనం: దక్షిణాయణం, విశేషం: మాస శివరాత్రిసూర్యోదయం: 6.02 , సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 4.57 చంద్రాస్తమయం: 4.06 తిథి: బహుళ తదియ ఉ. 10.22 వరకు, తదుపరి చవితి నక్షత్రం: విశాఖ ఉ. 6.00 వరకు, తదుపరి స్వాతి యోగం: ప్రీతి తె. 4.32 వరకు, తదుపరి ఆయుష్మాన్ కరణం: వణిజ ఉ. 10.22 వరకు, తదుపరి భద్ర రా. 10.24 వరకు, తదుపరి శకుని

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాలకు వేళాయే



- ఓట్ల లెక్కింపునకు 365 కేంద్రాలు.. 9,062 కౌంటింగ్ బల్లల ఏర్పాటు
- శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం
- ఏడు పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్: రాష్ట్ర ఎన్నికల సంఘం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫలితాల వెల్లడికి రాష్ట్రవ్యాప్తంగా 365 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుందని - మిగతా3లో



ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్

- సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీలో మరో ముందడుగు
- సెమికాన్ 2.0 పోర్టల్ ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్
- రూ.7,500 కోట్లకు పైగా విలువైన 12 ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులకు ఆమోదం
- దేశీయ జీపీయూ చిప్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం

ప్రతి బాధిత రైతునూ ఆదుకుంటాం

- అర్నబ్, మురసుతో తీవ్ర నష్టం
- కోత వేళ మురసు దెబ్బ.. రైతు ఆశలపై నీళ్లు!
- పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా అండ
- చివరి బాధితుడికి సాయం అందేవరకు క్షేత్రస్థాయిలోనే అధికారులు
- దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు చర్యలు



రేటూరు

మంచి దిగుబడితో పంట చేతికొచ్చే సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులతో మాట్లాడి, ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించామని తెలిపారు. మంచి దిగుబడి వచ్చి పంట చేతికందే సమయంలో మురసు తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం ఎక్కువగా - మిగతా3లో

దిల్లీని కమ్మేసిన కాలుష్యం.. గ్రాప్-3 ఆంక్షలు అమలు

- ఏక్యూఐ 390 దాటడంతో అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధం
- బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ వాహనాలపై ఆంక్షలు
- చిన్నారులకు ఆన్‌లైన్ తరగతులు.. మెట్రో, బస్సు సర్వీసులు పెంపు
- ధంతేరస్ కొనుగోళ్లతో కిక్కిరిసిన రహదారులు





ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి మరో అవకాశం

- ఏపీ, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల ఓటర్లకు ఈసీ వెసులుబాటు
- ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే ఛాన్స్
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సంప్రదించాలని అధికారులకు ఆదేశాలు
- ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ విమర్శలు.. యూటర్న్ అంటూ జైరాం రమేశ్ వ్యాఖ్యలు

అన్నదాత సహా అందరికీ ముప్పే!



- ఎల్‌నినో దెబ్బ.. అన్నదాత నుంచి సామాన్యుడి వరకు ముప్పే
- వ్యవసాయాన్ని కుదిపేస్తున్న వాతావరణ మార్పులు: క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం
- ఆహార ధరలు, గృహ బడ్జెట్లు, ద్రవ్యోల్బణంపైనా ప్రభావం
- దేశంలో ఆరు రాష్ట్రాల్లో కరవు ప్రకటన
- ప్రకృతి వ్యవసాయం, కోల్డ్ చైన్ విస్తరణకు నివేదిక సిఫార్సు

న్యూఢిల్లీ

ఎల్‌నినో ప్రభావంతో దేశంలో వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని, వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతోందని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ హెచ్చరించింది. నీటి ఎద్దడి, పర్యావరణ క్షీణత, సాగు పెట్టుబడుల పెరుగుదలతో వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొంది. ఈ పరిస్థితులు రైతుల జీవనోపాధికే కాకుండా ఆహార ధరలు, కుటుంబాల ఖర్చులు, ద్రవ్యోల్బణంపైనా ప్రభావం చూపనున్నాయని వెల్లడించింది. ఈ అంశాలపై సంస్థ ప్రత్యేక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. ఎల్‌నినో కారణంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు రైతుల ఆదాయాన్ని, జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని శ్వేతపత్రం - మిగతా3లో



ఓటు హక్కుతో పాటు సంక్షేమ పథకాలకూ ముప్పు

- ఇది ఓట్ల చోరీ కాదు.. పౌరుల హక్కుల చోరీ: రాహుల్ గాంధీ
- ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీతో పథకాల అమలుపై అభ్యంతరం
- ఎస్ఐఆర్‌తో ఓటర్ల పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన
- కాలుష్యం, ధరల పెరుగుదలపైనా కేంద్రంపై జైరాం రమేశ్ విమర్శలు

ఏపీలో జలకళ.. జలాశయాల్లోకి కొత్త నీరు



- 505.76 టీఎంసీలకు చేరిన నీటి నిల్వలు
- పూర్తి సామర్థ్యంలో 43.51 శాతం నీరు
- శ్రీశైలంలో ఇంకా తక్కువ నిల్వలు.. భారీ వర్షాల కోసం ఎదురుచూపులు
- ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు
- శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు
- రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలు జలాశయాల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం ప్రస్తుతం ప్రాజెక్టులన్నింటిలో కలిపి 505.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది మొత్తం జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీల్లో 43.51 శాతానికి సమానం. ఇంకా 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. నదీ బేసిన్ల వారీగా పరిశీలిస్తే కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో అత్యధికంగా 318.27 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది ఆ బేసిన్ ప్రాజెక్టుల సామర్థ్యంలో 42.47 శాతం. పెన్నా బేసిన్‌లో 107.74 - మిగతా3లో



శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో అందరికీ ఆహ్వానం

- స్టార్‌లింక్ చివరగా దరఖాస్తు చేసింది: కేంద్రం స్పష్టీకరణ
- భారత్‌లో పోటీకి పూర్తి స్వేచ్ఛ.. వినియోగదారుడే అంతిమ నిర్ణేత
- స్పెక్ట్రమ్ కేటాయింపు, ధరల ఖరారుపై కసరత్తు
- భద్రతా నిబంధనలు పూర్తి చేసిన తర్వాతే వాణిజ్య సేవలు



ఓబీసీ క్రీమీలేయర్‌లో తల్లిదండ్రుల జీతం లెక్కించొద్దు

- కేంద్రం అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- సీఎస్ఈ--2025 అభ్యర్థులకూ మార్చి తీర్పు వర్తింపు
- పాత నియామకాలు, సర్వీసు కేటాయింపులు తిరిగి తెరవాల్సిన అవసరం లేదు
- తీర్పు అమలుకు కేంద్రానికి మరో రెండు నెలల గడువు

తాడిపూడిలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన టిడిపి నాయకులు



తాళ్లపూడి, నవంబర్ 6, ప్రజాజ్యోతి న్యూస్ తుఫాన్ కారణంగా కొవ్వాడ నీటి ఉధృతికి తాడిపూడి గ్రామంలో సుమారు 30 కుటుంబాలు నీట మునిగాయి. బాధిత కుటుంబాలు పడుతున్న ఇబ్బందిని తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు నామా కొండబాబు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుమారు రూ.600 విలువైన బియ్యం, వంటనూనె, కూరగాయలతో కూడిన నిత్యావసర సరుకుల కిట్లను సిద్ధం చేసి టిడిపి తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్, సిద్ధన రాధాకృష్ణ చేతుల మీదగా బాధిత కుటుంబాలకు అందించారు.ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని కష్టంలో ఉన్నవారికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పర్చూరును ఆదుకోవాలని సీఎంకు ఏలూరి వినతి



పర్చూరు నవంబరు 6 (ప్రజా జ్యోతి ప్రతినిధి) మురసు తుపానుతో తీవ్రంగా దెబ్బతిన్న పర్చూరు నియోజకవర్గాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి నియోజకవర్గంలో జరిగిన నష్టాలను వివరించారు. వివిధ శాఖల అంచనాలు, ఫొటోలతో కూడిన నివేదికను అందజేస్తూ మొత్తం రూ.202.87 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.తుపాను ప్రభావంతో కొమ్మమూరు కాలువకు 55 చోట్ల గండ్లు పడగా, మరమ్మతులకు రూ.5 కోట్లు అవసరమని తెలిపారు. రహదారులు, కల్వర్టులు, వంతెనల పునరుద్ధరణకు రూ.64.13 కోట్లు, రొంపేరు పరివాహక ప్రాంతంలోని వరద కాలువలు, డ్రైన్ల అభివృద్ధికి రూ.95 కోట్లు కేటాయించాలని కోరారు. డ్రైన్ల అభివృద్ధి పనులకు సాంకేతిక అనుమతులు లభించాయని, ఆర్థిక ఆమోదం ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.నియోజకవర్గంలో 5,962 ఇళ్లు దెబ్బతినగా, 574 గొర్రెలు, మేకలు, 52 గేదెలు మృత్యువాత పడ్డాయని వివరించారు. సుమారు 3 వేల నుంచి 4,500 వరకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, విద్యుత్ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జనుము, మొక్కజొన్న, మిర్చి, పొద్దుతిరుగుడు, మినుము, శనగ పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 12 రక్షిత మంచినీటి పథకాల అభివృద్ధికి గతంలో మంజూరైన రూ.38.74 కోట్ల నిధులను తిరిగి విడుదల చేయాలని కోరారు. తుపాను బాధిత కుటుంబాలు, రైతులను ఆదుకోవడంతో పాటు దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణకు ప్రతిపాదనలను త్వరగా ఆమోదించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి ముఖ్యమంత్రిని కోరారు.

హోల్‌సేల్ పేరుతో బాణాసంచా దందా...

అధిక ధరలకు బాణసంచా విక్రయాలు!

- 360 డేస్ బోర్డులకే పరిమితమైన హోల్‌సేల్ వ్యాపారం..

సామాన్యుల జేబులకు చిల్లు

- సామాన్యులకు బాదుడే బాదుడు

- అధికారుల చర్యలేవి



పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్: పొందూరు మండలం బురిడి కంచరం సమీపంలో నిర్వహిస్తున్న బాణసంచా విక్రయాలపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 365 డేస్ హోల్‌సేల్ ధరలకు మందుగుండు సామగ్రి విక్రయిస్తామంటూ బోర్డులు ఏర్పాటు చేసి, లైసెన్స్ షాపులుగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, వాస్తవంగా విక్రయాలు మాత్రం అధిక ధరలకు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.హోల్‌సేల్ ధరలకు బాణసంచా లభిస్తుందని ఆశతో షాపులకు వెళ్తున్న సామాన్య వినియోగదారులకు నిరాశే ఎదురవుతోందని, నాన్‌బ్రాండెడ్ కాకరలు, ఇతర బాణసంచా సామగ్రిని సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. హోల్‌సేల్ ధరల పేరుతో ప్రజలను ఆకర్షించి, చివరకు వారి జేబులకు చిల్లు పడేలా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.మరోవైపు బాణసంచా విక్రయించే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాల అమలుపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అగ్నిప్రమాదాలు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే తక్షణ రక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉన్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. షాపుల పరిసర ప్రాంతాల్లోనూ ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. బాణసంచా విక్రయాలపై తనిఖీలు నిర్వహించి, లైసెన్సుల చెల్లుబాటు, భద్రతా ప్రమాణాలు, ధరల పట్టికలు, విక్రయిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎం.జె.పి.ఏ.పీ.బి.సి.డబ్ల్యూ.ఆర్. పాఠశాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన





బనగానపల్లె:నవంబర్=06 ప్రజాజ్యోతి ఇల్లూరుకోతపేట: వృత్తి విద్యలో భాగంగా ఇల్లూరుకోతపేటలోని బాలుర పాఠశాల విద్యార్థులు మినరల్ వాటర్ ఇండస్ట్రీని సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మినరల్ వాటర్ తయారీ విధానం, నీటి శుద్ధి ప్రక్రియ, ఆర్ ఓ ప్లాంట్ పనితీరు, ఫిల్ట్రేషన్, యువి శుద్ధి, నీటి నాణ్యత పరీక్షలు, బాటిళ్లలో నీటిని నింపడం, ప్యాకింగ్ వంటి వివిధ ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశ్రమలో వినియోగించే యంత్రాలు, ఎలక్ట్రికల్ పరికరాల పనితీరు, వాటి నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై అవగాహన పొందారు.పరిశ్రమ నిర్వాహకులు దస్తగిరి విద్యార్థులకు పరిశ్రమ పనితీరును వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. తరగతి గదిలో నేర్చుకున్న సాంకేతిక అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానం లభించిందని తెలిపారు.ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. బాలాజీ పర్యవేక్షణలో, వృత్తి విద్యా శిక్షకులు మహేష్ బాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు.ఈ పారిశ్రామిక సందర్శన విజయవంతంగా నిర్వహించడానికి నాగన్న సార్ ప్రత్యేక సహకారం, చేయూత అందించగా, పాఠశాల ఉపాధ్యాయులందరూ తమ సహకారం అందించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో వివరాలు

డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.వి. శ్రీనివాసరావు వెల్లడి



ఎటపాక, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదలైనట్లు ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 28వ తేదీ నుంచే అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను పొందుపరిచామని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ వివరాలను నమోదు చేసి వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు, అందులో పేర్కొన్న పరీక్ష కేంద్రం, సమయం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఆయన కోరారు. ఏవైనా సందేహాలుంటే వెంటనే విద్యాలయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

జిల్లెలమూడిలో వరద బీభత్సం. నష్టాన్ని పరిశీలించిన సీఎం

వరద నష్టాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు.

సమస్యను వివరించిన ఎమ్మెల్యే వేగేశన



బాపట్ల నవంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)మురసు తుఫాన్ కారణంగా నల్లమడ డ్రైన్‌లో ఏర్పడిన వరద ఉద్ధృతి, దాని ప్రభావంతో జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బాపట్ల మండలం జిల్లెలమూడి వద్ద ఉన్న నల్లమడ డ్రైన్ ప్రాంతాన్ని సందర్శించి, వరద ప్రవాహానికి దెబ్బతిన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రైన్‌కు గండ్లు పడటం, వరద నీరు పంట పొలాల్లోకి ప్రవేశించడంతో ఏర్పడిన పరిస్థితులను తెలుసుకున్నారు.తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నల్లమడ డ్రైన్‌లో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. నీటి ఉద్ధృతికి డ్రైన్ పలుచోట్ల దెబ్బతినడంతో సమీపంలోని వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. ప్రధానంగా వరి పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు లోతట్టు ప్రాంతాలు, సమీప కాలనీల్లోకి వరద నీరు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు నల్లమడ డ్రైన్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వరద ప్రవాహం కారణంగా డ్రైన్‌కు జరిగిన నష్టాన్ని, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు. డ్రైన్‌కు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, భవిష్యత్తులో ముంపు సమస్య తలెత్తకుండా దాని సామర్థ్యాన్ని పెంచితే సమస్య పునరావృతం కాకుండా ఉంటుందని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుందని కోరారు.వరద నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ముఖ్యమంత్రి పర్యటనతో నల్లమడ డ్రైన్ సమస్య పరిష్కారంపై స్థానికుల్లో ఆశలు చిగురించాయి. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్, ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి.

జర్నలిస్టులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఫెడరేషన్ నాయకులు





నంద్యాల:రుద్రవరం :నవంబర్=06ప్రజాజ్యోతి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రుద్రవరం లో ఘనంగా నిర్వహించారు. ఏపీ డబ్ల్యు జే ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జిని నాగయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుల వృత్తిపరమైన భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, కలం స్వేచ్ఛను కాపాడటంతో పాటు ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, చిన్న పత్రికలను ప్రోత్సహించడంతో పాటు జర్నలిస్టుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు.ఏళ్ల తరబడి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులకు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి, పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు.ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జర్నలిస్టులు బైరిమోహన్, నాగ నరసింహులు, మద్దిలేటి, ఇమ్మానియేల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాయపడిన వైఎస్సార్సీపీ కార్యకర్త హరిని పరామర్శించిన కాటసాని ఓబుల్ రెడ్డి



బనగానపల్లె:నవంబర్=06 ప్రజాజ్యోతి బనగానపల్లె పట్టణం చక్రవర్తి టాకీస్ ఏరియాకి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త దేవరకొండ హరి ఇటీవలే ప్రమాదానికి గురి అయి కాలు శస్త్ర చికిత్స చేసుకొని డిశ్చార్జ్ కావడంతో అతని స్వగృహానికి వెళ్లి అతన్ని పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొన్న వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి ఈకార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి అత్తర్ జాహిద్ హుస్సేన్,పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మమ్మదా, అత్తర్ అఖిల్ తదితరులుపాల్గొన్నారు

రైల్వే స్టేషన్ రోడ్డు వెంట కంప చెట్లు తొలగించాలి ప్రజా సంఘాలు



కోవెలకుంట్ల:నవంబర్=06 ప్రజాజ్యోతి కోవెలకుంట్ల ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోయిలకుంట్ల పట్టణ శివారులోని రైల్వే స్టేషన్ పరిధిలో రోడ్ల వెంట ఉన్న కంపచెట్లు వెంటనే తొలగించాలని అలాగే రైల్వే స్టేషన్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిరసన తెలిపి స్టేషన్ మాస్టర్ గారికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది .తక్షణమే రోడ్ల వెంబడి ఉన్న కంపచెట్లను తొలగించడం జరిగింది. దీనికి ప్రజా సంఘాలుగా హర్షం వ్యక్తం చేస్తూ రోడ్ల వెంబడి ఉన్న వీధిలైట్లు వేయాలని అలాగే మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజాసంఘాలు కోరారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ గారికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు

పలు కార్యక్రమాలకు హాజరైన కాటసాని రామిరెడ్డి





బనగానపల్లె:నవంబర్=06 ప్రజాజ్యోతి బనగానపల్లె నియోజకవర్గం లోని పలు వివాహ మరియు నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి , అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి

ప్రతి బాధిత రైతునూ ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు.

ముందస్తు హెచ్చరికలను తేలిగ్గా తీసుకోవద్దు

ప్రభుత్వం ముందస్తుగా చేపట్టిన చర్యల వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని చంద్రబాబు తెలిపారు. తుపానులపై హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ముందస్తు జాగ్రత్తలతోనే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామని చెప్పారు. సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

40 వేల విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

అర్నబ్ తుపాను కారణంగా నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను ఇప్పటికే పునరుద్ధరించామని సీఎం తెలిపారు. మురసు తుపానుతో దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నట్లు చెప్పారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నామని వివరించారు.

పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీతో భరోసా

తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయి అంచనాలు వేస్తున్నామని, ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపాను ప్రభావంపై వివరాలు అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చివరి బాధితుడికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత



పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలకే ప్రాధాన్యం

గత ప్రభుత్వంపై చంద్రబాబు విమర్శలు చేశారు. గత పాలనలో తుపానుల సమయంలో పర్యటనలు, పరామర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యం ఇస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. పరిషత్ ఎన్నికల ఫలితాల తర్వాత అన్ని విషయాలపై మాట్లాడతానని చెప్పారు.

నీటి భద్రతకు ప్రాధాన్యం

తీర ప్రాంతాలను తుపానులు దెబ్బతీస్తుంటే, రాయలసీమ ప్రాంతం ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.

వంద శాతం స్ట్రైక్ రేటు కథ...

కాకినాడ : స్థానిక ఎన్నికల్లో జనసేన మరోసారి సత్తా చూపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేట్ ఎలా అయితే సాధించిందో.. స్థానిక ఎన్నికల్లో కూడా అదే స్థాయి ఫలితాలను మరోసారి రిపీట్ చేసింది. కూటమి ధర్మాన్ని పాటిస్తూ.. టిడిపి.. బిజెపికి సహకరిస్తూ అదరగొట్టింది. కొన్ని ప్రాంతాలలో జనసేన రెబల్ పోటీ చేసిన ఆదోని ప్రాంతంలో మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. పోటీ చేసిన అన్ని స్థానాలలో గ్లాస్ అదరగొట్టింది.స్థానిక ఎన్నికల్లో మొత్తం 86 మున్సిపాలిటీలు.. 13 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయి. 13 మున్సిపల్ కార్పొరేషన్లలో 12 చోట్ల కూటమి జయ కేతనం ఎగరవేసింది. 86 మున్సిపాలిటీలలో 83 స్థానాల మీద కూటమి జెండా ఎగరవేసింది. వైసీపీ ఖాతాలో నందికొట్కూరు.. బేతంచెర్ల.. నాయుడుపేట చేరాయి. జనసేన ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు, విజయవాడలో వంగవీటి రాధాకృష్ణ విజయం సాధించారు. రాధా మెజారిటీ కూడా 2 లక్షలు ఉంది. ఈ స్థాయిలో విజయం సాధించి.. తమ కేటాయించిన స్థానాలలో అదరగొట్టారు.అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తిరుగులేని స్థాయిని చూపించింది. 100% స్ట్రైక్ రేట్ కొనసాగించింది. కూటమి పొత్తు ధర్మాన్ని పాటించింది. ఏ మాత్రం కూడా క్షేత్రస్థాయిలో ఇపరు లేకుండా చూసుకుంది. స్థానిక ఎన్నికల్లో కూడా అదే జోరు చూపించింది. పవన్ కళ్యాణ్ మాటలను శిరోధార్యంగా భావించి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు.. నాయకులు శ్రమించారు. వైసిపి ఎన్ని రకాలుగా విష ప్రచారం చేసినప్పటికీ.. కూటమిలో ఐక్యత లేదని సొంత మీడియాలో రకరకాలుగా వార్తలు వండి వార్చినప్పటికీ అదంతా కూడా కేవలం ఊకదంపుడు ప్రచారమే అని నిరూపించింది. స్థానిక ఎన్నికల్లో.. అంతకుముందు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేట్ సాధించడం అంటే మాటలు కాదు. ఇదంతా కూడా పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి.. కార్యకర్తల సంకల్పానికి నిదర్శమని చెబుతున్నారు విశ్లేషకులు.. ఇదే జోరు జనసేన భవిష్యత్తులో కూడా కొనసాగిస్తే తిరుగుండదని.. విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.కేవలం కాపు సామాజిక వర్గం బలంగా ఉన్నచోట మాత్రమే జనసేన సత్తా చూపించిందని గతంలో అనేకమంది విమర్శలు చేశారు. అయితే ఈసారి స్థానిక ఎన్నికల్లో ఆ విమర్శలను పటా పంచలు చేసింది జనసేన. అనువు గాని చోట్లలో కూడా అదరగొట్టింది. దీనికి టిడిపి.. బిజెపి ఓటు బ్యాంకు కూడా కలిసి వచ్చింది. తద్వారా జనసేన ఘనవిజయం సాధించింది. 100% స్ట్రైక్ రేట్ అంటే మాటలు కాదు. నేటి పాలిటిక్స్ లో తను సృష్టించిన రికార్డును తాను కొనసాగించడం అంటే అంత ఈజీ కాదు. కానీ దీన్ని



చేతల్లో చేసి చూపించింది జనసేన. వచ్చిన స్థానాలలో విజయం సాధించి.. మిగతా స్థానాలలో టిడిపి విజయానికి కృషి చేసింది.జనసేన మొత్తంగా నాలుగు కార్పొరేషన్లు.. 18 మున్సిపాలిటీలు.. మూడు నగర పంచాయతీలో పోటీ చేసింది. ఎన్నికల జరిగిన రెండు కార్పొరేషన్లు.. 15 మున్సిపాలిటీలు.. మూడు నగర పంచాయతీలను జనసేన గెలుచుకుంది. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోని రెండు మున్సిపాలిటీలతో సహా ప్రస్తుతం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న అన్నిచోట్ల మున్సిపాలిటీలను పొత్తులో భాగంగా జనసేన తీసుకుంది. కొత్త ప్రాంతాలకు విస్తరించేలాగా మరికొన్ని స్థానాలు కూడా తీసుకుంది. కొత్త నియోజకవర్గాలను పార్టీని విస్తరించినందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకుంది. వైసిపి.. టిడిపి నుంచి వచ్చిన వారికి కూడా కొన్ని చోట్ల అవకాశం కల్పించి.. కొత్త నాయకత్వం విస్తరణకు కృషి చేసింది. 2024 లో జరిగిన శాసనసభ.. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానంలో జనసేన గెలిచింది. ఆ రికార్డును ఈ స్థానిక ఎన్నికల్లో కూడా కొనసాగించింది.. పిఠాపురం.. పాలకొండ.. తెనాలి.. తాడేపల్లిగూడెం.. భీమవరం.. నరసాపురం.. కాకినాడ వంటి ప్రాంతాలలో ప్రజా ప్రతినిధులు ఉన్నప్పటికీ.. అక్కడ మున్సిపల్.. కార్పొరేషన్ ఎన్నికల్లోనూ పొత్తులను స్వీకరించింది. అయితే కాకినాడ.. తాడేపల్లిగూడెం.. భీమవరం ప్రాంతాలలో ఎన్నికలు జరగలేదు. కీలకమైన విజయవాడ నగరంలో మేయర్ స్థానానికి పోటీ చేసి గెలిచింది. ఇక్కడ వంగవీటి రాధాకృష్ణకు అవకాశం కల్పించింది. ఏలూరు కార్పొరేషన్.. శ్రీకాకుళంలో కొత్తగా పార్టీని విస్తరించినందుకు పొత్తులు కుదుర్చుకుంది. తుని.. పెద్దాపురం (సామర్లకోట మున్సిపాలిటీ), దర్శి, తిరువూరు, చిలకలూరిపేట, ముమ్మిడివరం, అమలాపురం, పెడన, మడకశిర, పుట్టపర్తి, నగరి (పుత్తూరు మున్సిపాలిటీ) నియోజకవర్గాలకు పార్టీని విస్తరించే విధంగా కృషి చేసింది. అయితే ఇక్కడ తీసుకున్న స్థానాలలో జనసేన గెలవడం విశేషం.డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం పురపాలకంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. పూర్తిస్థాయిలో మెజారిటీని దక్కించుకున్నారు. అయితే ఇక్కడ 10 వార్డులలో ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించడం విశేషం. వీరిలో కొంతమంది కూటమి రెబల్స్, ఇద్దరు వైసిపి రెబల్స్ ఉన్నారు. జనసేన నుంచి చైర్మన్ అభ్యర్థిగా నిలిచిన దానం లాజర్ తన సమీప ప్రత్యర్థి పెదపాటి రాజేష్ కుమార్ మీద 9235 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ మొత్తం 36 వార్డులు ఉన్నాయి. వీటిలో మూడు గతంలోని జనసేనకు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 33 వార్డులలో జనసేన 16.. టిడిపి ఐదు.. బిజెపి ఒకటి.. ఇండిపెండెంట్ లు 10 వార్డులలో గెలిచారు. కేవలం 19వ వార్డులో మాత్రమే వైసిపి విజయం సాధించింది. ఏకగ్రీవం కలుపుకొని జనసేనకు 25 స్థానాలు లభించాయి.

లోకేష్ పకడ్బందీ వ్యూహం

గుంటూరు : స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ముందస్తు సమయం నుంచి దాదాపు పది రోజుల పాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఎక్కడా బహిరం గంగా కనిపించకపోవడంపై కొద్దిరోజుల క్రితం సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు, చర్చలు సాగాయి. క్షేత్రస్థాయి ప్రచారాల్లో ఆయన కనిపించకపోవడంతో ప్రత్యర్థులు దీనిపై రకరకాల వ్యాఖ్యానాలు చేశారు. అయితే, ఆ నిశ్శబ్దం వెనుక ఎంతటి పకడ్బందీ వ్యూహం దాగి ఉందో తెలిసిన వారికి మాత్రం అది ఆశ్చర్యం కలిగించలేదు. కెమెరాల ముందుకు రాకుండా నారా లోకేష్ రహస్య వార్ రూమ్‌లో కూర్చుని.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఎన్నికల మిషన్‌ను సూక్ష్మస్థాయిలో సిద్ధం చేయడంలోనే ఆ సమయాన్ని పూర్తిగా వెచ్చించారు. ప్రచార ఆర్భాటాల కంటే కూడా ఫలితాలను శాసించే సంస్థాగత ఎలక్షనీరింగ్ వ్యూహాన్ని రూపొందించడమే లక్ష్యంగా ఆయన తెరవెనుక మంత్రాంగం నడిపించారు.సాధారణంగా ఎన్నికలంటే సభలు, రోడ్‌షోలు, మైకుల హోరు మాత్రమే అనుకునే వారికి.. ఆధునిక రాజకీయాల్లో డాటా సైన్స్, క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ ఎంతటి కీలక పాత్ర పోషిస్తాయో లోకేష్ కార్యాచరణ స్పష్టం చేసింది. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల వారీగా స్థానిక సమీకరణాలను బేరీజు వేస్తూ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలతో ఎక్కడా విభేదాలు రాకుండా సీట్ల సర్దుబాటు రూట్ మ్యాప్ తయారు చేయడం, బూత్ స్థాయి కమిటీలను అప్రమత్తం చేయడం, ఓటర్ల చేరికలు-జాబితాల పరిశీలన వంటి క్లిష్టమైన ప్రక్రియలను వార్ రూమ్ నుంచే స్వయంగా



పర్యవేక్షించారు. ప్రణాళిక రచన మొదలుకుని అమలు వరకు ప్రతి అడుగూ పక్కాగా సాగిపోయేలా డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానించారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నమోదు చేసిన చారిత్రాత్మక క్లీన్‌స్వీప్ వెనుక లోకేష్ అమలు చేసిన ఈ మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ మధ్య ఎలాంటి గందరగోళం లేకుండా ఓట్ ట్రాన్స్‌ఫర్ విజయవంతంగా జరగడం, జెన్-జీ సహా కొత్త ముఖాలకు టిక్కెట్లు దక్కడం, అసమ్మతి తలెత్తిన చోట తక్షణమే సమన్వయం కుదరడం.. ఇవన్నీ లోకేష్ వార్ రూమ్ వ్యూహాల ఫలితమేనని స్పష్టమవుతోంది. ప్రత్యర్థులు అనవసర రాజకీయ విమర్శలు, వివాదాల్లో మునిగిపోయిన వేళ.. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ ఎన్నికల యంత్రాంగాన్ని విజయతీరాలకు నడిపించడంలో ఆయన ప్రదర్శించిన వ్యూహాత్మక చాతుర్యం ప్రతిపక్షాలకు కనీసం కోలుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.మైకుల ముందు హంగామా చేసే నాయకులు కొందరైతే.. తెరవెనుక ఉండి మొత్తం రాజకీయ ముఖచిత్రాన్ని తిరగరాయగల వ్యూహకర్తలు అరుదుగా ఉంటారు. ఆ కోణంలో చూస్తే కూటమి సాధించిన ఈ అఖండ మున్సిపల్ విజయంలో నారా లోకేష్ నిజమైన సైలెంట్ హీరో గా నిరూపించుకున్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచే పార్టీ ఎన్నికల వ్యూహాలను కార్పొరేట్ స్థాయిలో నడిపిస్తూ వస్తున్న ఆయన.. ఈ స్థానిక పోరులోనూ తనదైన ఎలక్షనీరింగ్ ముద్ర వేసి తిరుగులేని ఫలితాన్ని రాబట్టారు. ప్రచారం లేకపోయినా ఫలితాలే మాట్లాడాలన్నట్లుగా లోకేష్ సాగించిన ఈ నిశ్శబ్ద మిషన్.. భవిష్యత్ ఎన్నికల సమరాలకు కూడా కూటమికి ఒక తిరుగులేని విజయ నమూనాగా నిలిచింది.

ఏపీలో జలకళ.. జలాశయాల్లోకి కొత్త నీరు!

-మొదటిపేజీ తరువాయి

టీఎంసీలు (36.47 శాతం), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72 శాతం) నీరు అందుబాటులో ఉంది. ఇతర బేసిన్ల పరిధిలోని ప్రాజెక్టుల్లో కలిపి 58.72 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయి.

శ్రీశైలంలో 23.9 శాతమే నీరు

ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. శుక్రవారం నాటి గణాంకాల ప్రకారం శ్రీశైలం డ్యామ్ పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 51.60 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది 23.9 శాతం నిల్వకు సమానం. 885 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గాను ప్రస్తుతం 832 అడుగుల వద్ద నీరు ఉంది. నాగార్జునసాగర్‌లో 180.91 టీఎంసీలు (58 శాతం), పులిచింతలలో 28.19 టీఎంసీలు (61.6 శాతం) నీరు నిల్వ ఉంది. మరోవైపు పెన్నా బేసిన్‌లోని సోమశిలలో 19.74 టీఎంసీలు (25.3 శాతం), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6 శాతం) మాత్రమే ఉన్నాయి.

కొన్ని ప్రాజెక్టుల్లో ఆశాజనక నిల్వలు

గండికోటలో 69.5 శాతం, గోరకల్లులో 78.8 శాతం, ఏలేరు జలాశయంలో 91 శాతం నీటి నిల్వలు నమోదయ్యాయి. ఈ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆశాజనకంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ. వర్షపాతం

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ 4వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరుతున్నప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టుల్లో నిల్వలు గణనీయంగా పెరగాలంటే మరిన్ని భారీ వర్షాలు అవసరమని ప్రస్తుత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాలకు వేళాయే!

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 365 కౌంటింగ్ కేంద్రాల్లో మొత్తం 9,062 కౌంటింగ్ బల్లల ద్వారా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు. ప్రతి కౌంటింగ్ బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను అందజేసి లెక్కింపు చేపడతారని తెలిపారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల వెల్లడిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

ఏడు కేంద్రాల్లో రీపోలింగ్ పూర్తి

మరోవైపు బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఏడు పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం రీపోలింగ్ నిర్వహించారు. అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఆయా కేంద్రాల్లో రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. రీపోలింగ్ పూర్తికావడంతో ఓట్ల లెక్కింపునకు మార్గం సుగమమైంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు.

అన్నదాత సహా అందరికీ ముప్పే!



-మొదటిపేజీ తరువాయి

పేర్కొంది. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, కరవు ప్రభావం క్రమంగా పట్టణ ప్రాంతాలపైనా కనిపిస్తోందని తెలిపింది. పొలం నుంచి మార్కెట్ వరకు పంటల సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవుతోందని వివరించింది. వ్యవసాయ దిగుబడులు తగ్గడం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్ల ఆహార పదార్థాల ధరలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది సామాన్యుల గృహ బడ్జెట్లపై భారం మోపడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుందని విశ్లేషించింది.

ఆరు రాష్ట్రాల్లో కరవు ప్రకటన

ఎల్‌నినో ప్రభావంతో దేశ ఆహార సరఫరా వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని క్లైమేట్ ట్రెండ్స్ తెలిపింది. ఇప్పటికే ఆరు రాష్ట్రాలు కరవును ప్రకటించాయని పేర్కొంది. అయితే ఇతర రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు లేవని దీని అర్థం కాదని స్పష్టం చేసింది. కరవు ప్రకటిస్తే పెట్టుబడులపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో కొన్ని రాష్ట్రాలు అధికారిక ప్రకటనకు వెనుకాడుతున్నాయని నివేదిక అభిప్రాయపడింది.

పంటలు పాడవుతున్నా.. నిల్వ సదుపాయాలు అంతంతే

కరవు కారణంగా భూములు సాగుకు అనుకూలత కోల్పోతే రైతు కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ఇది వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా విస్తృత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. కరవును కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా వ్యవస్థాగత సవాలుగా చూడాలని సూచించింది. దేశంలో పండ్లు, కూరగాయల్లో దాదాపు 40 శాతం వినియోగదారులకు చేరకముందే పాడైపోతున్నాయని వెల్లడించింది. తాజా వ్యవసాయ ఉత్పత్తుల్లో కేవలం నాలుగు శాతానికే కోల్డ్ చైన్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. నిల్వ, రవాణా సౌకర్యాల కొరత కూడా రైతులకు నష్టాలను పెంచుతోందని వివరించింది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయ విధానాలు కేవలం దిగుబడుల పెంపుపైనే కాకుండా నేల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి సారించాలని క్లైమేట్ ట్రెండ్స్ సూచించింది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పేర్కొంది. చిన్న, సన్నకారు రైతులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని సిఫార్సు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది.

నివేదికలోని కీలక సిఫార్సులు

పండ్లు, కూరగాయల నిల్వ కోసం కోల్డ్ చైన్ వ్యవస్థను విస్తరించాలి. ప్రభుత్వాలు ఈ రంగంలో పెట్టుబడులు పెంచాలి. రైతు సమాఖ్యలు, సహకార సంస్థల్లో సంస్కరణలు చేపట్టి పొలం నుంచి మార్కెట్ వరకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. పంట ఉత్పత్తులను విక్రయించేందుకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలి. కౌలు రైతులతో సహా అర్హులైన రైతులందరినీ పంట, వాతావరణ ఆధారిత బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలి. మండల స్థాయిలో వాతావరణ సలహాలు, కరవు ప్రమాద అంచనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించి, వాటికి తగిన రాయితీలు కల్పించాలి. వ్యవసాయ బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు చేయాలి. పంట నష్ట పరిహారాన్ని పొలం వరకే పరిమితం చేయకుండా, ఉత్పత్తి మార్కెట్‌కు చేరే వరకు సరఫరా వ్యవస్థ అంతటా భద్రత కల్పించాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ విధానాల్లో సమగ్ర మార్పులు అవసరమని క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం స్పష్టం చేసింది. రైతుల ఆదాయ భద్రతతో పాటు ఆహార సరఫరా వ్యవస్థను కాపాడేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టాలని సూచించింది.

అంగరంగ వైభవంగా శ్రీరాముల వారి కల్యాణోత్సవం

- ఆబోతులపేటలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..

- మహా అన్నదానంలో పాల్గొన్న 3 వేల మందికి పైగా భక్తులు



జి.సిగడాం, ప్రజాజ్యోతి న్యూస్: శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం ఆబోతులపేట గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతీ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ శ్రీరాముని కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 3 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్నదాన ఏర్పాట్లు చేశారు. భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావం వెల్లివిరిసిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.

కమిషనర్ దివిజ సంపతికి టీడీపీ నాయకుల సన్మానం



గొల్లప్రోలు ప్రజా జ్యోతి గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలో ఎన్నికలను అత్యంత సామరస్యపూర్వకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు గాను మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతిని తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా పూర్తి చేసినందుకు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గుండ్ర సుబ్బారావు, స్థానిక కౌన్సిలర్లు మరియు పార్టీ ముఖ్య నాయకులు కలిసి కమిషనర్ దివిజ సంపతిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గొల్లప్రోలులో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేశారని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నియోజకవర్గ, పట్టణ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులను గుర్తించి పారిశుద్ధ్య పనులకు శ్రీకారం

కుమ్మరి వీధిలో మురుగు కాలువల శుభ్రత..

స్పందించిన 7వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పట్టణంలోని 7వ వార్డు పరిధిలో ఉన్న కుమ్మరి వీధిలో మురుగు కాలువల సమస్యతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా చర్యలు చేపట్టారు. వీధిలోని కాలువల్లో మురుగునీరు పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ విషయాన్ని గుర్తించిన కౌన్సిలర్ మహబూబ్ బాషా పారిశుద్ధ్య కార్మికులను అక్కడికి పంపించి కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు, వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. కార్మికుల సహాయంతో కాలువలను శుభ్రం చేయించి మురుగునీరు సజావుగా వెళ్లేందుకు అవసరమైన పనులు చేయించారు. దీంతో వీధిలో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లయింది. వార్డులో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు. వీధులు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని, పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తమ వీధిలో నెలకొన్న మురుగు కాలువల సమస్యపై స్పందించి శుభ్రత పనులు చేపట్టడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇలాంటి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని వారు కోరారు.

టీడీపీలో చేరిన ఇండిపెండెంట్ గా గెలిచిన కౌన్సిలర్లు





కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ గారు మరియు చైర్మన్ యశోద

గుంతకల్లు నవంబర్ 6 (ప్రజా జ్యోతి): గుంతకల్లు మున్సిపల్ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలబడి విజయం సాధించిన 41వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ కృష్ణ నాయక్ మరియు 43వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ డి.శరణ్య శుక్రవారం గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే రామగౌని జితేంద్ర గౌడ్ నివాసం నందు టీడీపీలోకి చేరడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ చైర్మన్ యశోద స్వతంత్ర కౌన్సిలర్ కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదాలతో గెలుపొందిన స్వతంత్ర కౌన్సిలర్లు టిడిపిలో చేరడం సంతోషకరమని ప్రజల ఆశీర్వాదంతో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరడం పార్టీ బలోపేతానికి మరింత బలాన్ని చేకూర్చిం ది. అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కలిసి ముందుకు సాగేందుకు తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు వార్డు అభివృద్ధికి కృషి చేయాలనీ ప్రజల సమస్య లను పరిష్కరించాలన్నారు. చైర్మన్ యశోద మాట్లాడు తూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం,వార్డు సమస్యలు పరిష్కారం కోసం పాటుపడతామని, అభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దామన్నారు ఈ కార్యక్రమంలో యువ నాయకుడు పవన్ గౌడ్, పలువురు టిడిపి నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

9న శివాలపల్లి శ్రీ వీరభద్ర లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో బహుళ అమావాస్య పూజలు







చెన్నూరు, నవంబర్ 6, చెన్నూరు మండలం శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి (ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయంలో ప్రతి అమావాస్య లాగానే ఈ అమావాస్య బహుళ అమావాస్య కావడంతో స్వామివారికి విశిష్టత తృప్తి కారణంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు, శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం నందు ఈ ఆశ్వీయుజ బహుళ అమావాస్య తో పాటు కార్తీక మాసం ప్రారంభ దశ రావడం ఒక విశేషం సోమ వారం ఉదయం 7:00 గంటలకు స్వామి వారికి ఆలయ అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ చేతుల మీదుగాపంచామృత పంచాభిషేకము పూల అలంకరణ నిర్వహిస్తారు, శివాల పల్లి గ్రామానికి చెందిన ఉభయ దాతలైన కీర్తిశేషులు ఆదిమూలం పాల పెద్దన్న వారి జ్ఞాపకార్థం వారి సతీమణి శ్రీమతి ఆదిమూలం లక్ష్మమ్మ, వారి కుమారుడు బిజెపి సీనియర్ నాయకుడు ఆదిమూలం వెంకటసుబ్బయ్య వారి కుటుంబ సభ్యులు చేతుల మీదుగా నిర్వహిస్తున్నారు, ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపకులు పొట్టి పాటి ప్రతాపరెడ్డి ఏర్పాట్లు చేశారు, భక్తాదులెల్లరు స్వామి వారిని దర్శించుకొని. తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావలసిందిగా నిర్వాహకులు కోరారు,కోరిన కోరికలు తీర్చే శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి వారికి ఎవరైనా అభిషేకము చేయించుకోదల చిన వారు ఆలయ వ్యవస్థాపకులు శ్రీ పొట్టిపాటి ప్రతాప్ రెడ్డి గారిని లేదా అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ గారి నీ సంప్రదించాలని కోరారు, వివరాలకు శ్రీ పొట్టిపాటి ప్రతాప్ రెడ్డి 94917 77800 శ్రీ కిరణ్ కుమార్ శర్మ 7893012 566 సంప్రదించాలని సూచించారు,

ఆలమూరు మండలంలో 72.38 శాతం పోలింగ్ నమోదు

ఆలమూరు, నవంబర్ 6 (ప్రజాజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల పరిధిలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 72.38 శాతం పోలింగ్ నమోదైంది. ఆలమూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) లక్ష్మీ ప్రత్యూష, తహసీల్దార్ కె. కుశరాజు,అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ (ఏఆర్వో), ఎంపీడీవో ఏ. రాజు తెలియజేసిన వివరాల ప్రకారం మండలంలోని 18 గ్రామాల పరిధిలో ఉన్న 21 ఎంపీటీసీ స్థానాల్లో నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 60,009 మంది ఓటర్లకు గాను 43,433 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ గణాంకాల ప్రకారం మండలవ్యాప్తంగా 16,576 మంది ఓటర్లు ఓటు వేయలేదు.

గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు:

మడికి గ్రామంలోని రెండు ఎంపీటీసీ స్థానాల్లో 6,839 ఓట్లకు గాను 4,892 ఓట్లు పోలై 71.53 శాతం నమోదైంది. బడుగువానిలంకలో 2,575 ఓట్లకు 1,976 ఓట్లు పోలై 76.74 శాతం, చొప్పెల్లలోని మూడు ఎంపీటీసీ స్థానాల్లో 6,724 ఓట్లకు 5,282 ఓట్లు పోలై 78.55 శాతం పోలింగ్ నమోదైంది. చెముదులంకలో 3,550 ఓట్లకు 2,627 ఓట్లు పోలై 74 శాతం, నర్సిపూడిలో 3,596 ఓట్లకు 2,530 ఓట్లు పోలై 70.36 శాతం, జొన్నాడలో 4,963 ఓట్లకు 4,000 ఓట్లు పోలై 80.60 శాతం పోలింగ్ నమోదైంది. మూలస్థానంలో రెండు ఎంపీటీసీ స్థానాలకు కలిపి 5,810 ఓట్లకు 4,093 ఓట్లు పోలై 70.45 శాతం, ఆలమూరులో మూడు ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 7,961 ఓట్లకు 5,346 ఓట్లు పోలై 67.15 శాతం నమోదైంది. కలవచర్ల, పెనికేరు పరిధిలో 4,073 ఓట్లకు 2,797 ఓట్లు పోలై 68.67 శాతం, మోదుకూరులో 1,853 ఓట్లకు 1,381 ఓట్లు పోలై 74.53 శాతం, గుమ్మిలేరులో 1,814 ఓట్లకు 1,292 ఓట్లు పోలై 71.22 శాతం పోలింగ్ నమోదైంది. పెదపళ్లలో 2,471 ఓట్లకు 1,780 ఓట్లు పోలై 72.04 శాతం, పినపళ్లలో 2,415 ఓట్లకు 1,791 ఓట్లు పోలై 74.16 శాతం, సంధిపూడిలో 1,960 ఓట్లకు 1,358 ఓట్లు పోలై 69.29 శాతం, చింతలూరు, సూర్యారావుపేట పరిధిలో 3,405 ఓట్లకు 2,288 ఓట్లు పోలై 67.20 శాతం పోలింగ్ నమోదైంది.

21 ఎంపీటీసీ స్థానాల వారీగా పోలింగ్ వివరాలు:

1. మడికి-1: 3,416 ఓట్లకు 2,392 ఓట్లు పోలై 70.02 శాతం.
2. మడికి-2: 3,423 ఓట్లకు 2,500 ఓట్లు పోలై 73.04 శాతం.
3. బడుగువానిలంక: 2,575 ఓట్లకు 1,976 ఓట్లు పోలై 76.74 శాతం.
4. చొప్పెల్ల-1: 2,000 ఓట్లకు 1,634 ఓట్లు పోలై 81.70 శాతం.
5. చొప్పెల్ల-2: 2,000 ఓట్లకు 1,570 ఓట్లు పోలై 78.50 శాతం.
6. చొప్పెల్ల-3: 2,724 ఓట్లకు 2,078 ఓట్లు పోలై 76.28 శాతం.
7. చెముదులంక: 3,550 ఓట్లకు 2,627 ఓట్లు పోలై 74 శాతం.
8. నర్సిపూడి: 3,596 ఓట్లకు 2,530 ఓట్లు పోలై 70.36 శాతం.
9. జొన్నాడ: 4,963 ఓట్లకు 4,000 ఓట్లు పోలై 80.60 శాతం.
10. మూలస్థానం-1: 2,905 ఓట్లకు 2,115 ఓట్లు పోలై 72.81 శాతం.
11. మూలస్థానం-2: 2,905 ఓట్లకు 1,978 ఓట్లు పోలై 68.09 శాతం.
12. ఆలమూరు-1: 2,840 ఓట్లకు 1,959 ఓట్లు పోలై 68.98 శాతం.
13. ఆలమూరు-2: 2,840 ఓట్లకు 1,927 ఓట్లు పోలై 67.85 శాతం.
14. ఆలమూరు-3: 2,281 ఓట్లకు 1,460 ఓట్లు పోలై 64.01 శాతం.
15. కలవచర్ల/పెనికేరు: 4,073 ఓట్లకు 2,797 ఓట్లు పోలై 68.67 శాతం.
16. మోదుకూరు: 1,853 ఓట్లకు 1,381 ఓట్లు పోలై 74.53 శాతం.
17. గుమ్మిలేరు: 1,814 ఓట్లకు 1,292 ఓట్లు పోలై 71.22 శాతం.
18. పెదపళ్ల: 2,471 ఓట్లకు 1,780 ఓట్లు పోలై 72.04 శాతం.
19. పినపళ్ల: 2,415 ఓట్లకు 1,791 ఓట్లు పోలై 74.16 శాతం.
20. సంధిపూడి: 1,960 ఓట్లకు 1,358 ఓట్లు పోలై 69.29 శాతం.
21. చింతలూరు/సూర్యారావుపేట: 3,405 ఓట్లకు 2,288 ఓట్లు పోలై 67.20 శాతం.

పోలింగ్ గణాంకాల్లో ప్రత్యేకతలు:

మండలంలోని 21 ఎంపీటీసీ స్థానాల్లో అత్యధికంగా చొప్పెల్ల-1 స్థానంలో 81.70 శాతం పోలింగ్ నమోదైంది. రెండో స్థానంలో జొన్నాడ 80.60 శాతంతో నిలిచింది. చొప్పెల్ల-2లో 78.50 శాతం, బడుగువానిలంకలో 76.74 శాతం పోలింగ్ నమోదైంది.

ఇక అత్యల్పంగా ఆలమూరు-3 ఎంపీటీసీ స్థానంలో 64.01 శాతం పోలింగ్ నమోదైంది. ఆలమూరు గ్రామంలోని మూడు ఎంపీటీసీ స్థానాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవడం గమనార్హం.

మొత్తంగా ఆలమూరు మండలంలో 72.38 శాతం పోలింగ్ నమోదు కావడంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పోలింగ్ ప్రక్రియ ముగియగా, శనివారం నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో నృత్య ప్రదర్శన ఇచ్చిన రావులపాలెం నాట్యాచారిణి కొల్లేపర ఫణిన్మయి







రావులపాలెం నవంబర్ 6(ప్రజాజ్యోతి):భారతదేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచే సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలను పురస్కరించుకుని గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ మహోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ నృత్యకళ కూచిపూడికి అరుదైన గౌరవం దక్కింది. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి రావులపాలేంకు చెందిన నాట్యాచారిణి కొల్లేపర ఫణిన్మయి విశేష గుర్తింపు పొందారు.దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొన్న ఈ జాతీయస్థాయి సాంస్కృతిక వేడుకల్లో భారతీయ కళా వైభవం, సాంస్కృతిక వైవిధ్యం, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 5,000 మంది కళాకారులు, 32కు పైగా నృత్య విభాగాలు పాల్గొనడం విశేషం.ఆంధ్రప్రదేశ్ నుంచి 92 మంది కూచిపూడి నృత్య కళాకారులు పాల్గొనేందుకు ముందుకు రాగా, నిర్వహించిన కఠినమైన ఆడిషన్స్ అనంతరం రాష్ట్రం నుంచి 71 మంది కళాకారులు తుది ప్రదర్శనకు ఎంపికయ్యారు. వీరిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన నాట్యాచారిణి, శ్రీ సాయి నటరాజ కళాపీఠం గురువు కొల్లేపర ఫణిన్మయి చోటు దక్కించుకోవడం విశేషం.ఈ ప్రతిష్ఠాత్మక నృత్య ప్రదర్శన కోసం కళాకారులకు పది రోజులపాటు ప్రతిరోజూ సుమారు 16 గంటల చొప్పున కఠినమైన నృత్య సాధన నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య పురుష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో నృత్య విన్యాసాలు, లయబద్ధమైన అడుగులు, అభినయ ప్రకటన, ఆహార్య సమన్వయం తదితర అంశాలపై ప్రత్యేకంగా సాధన చేయించారు.భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాల్లో విశిష్ట స్థానాన్ని కలిగిన కూచిపూడి నాట్యకళను జాతీయ వేదికపై ప్రదర్శించడంతోపాటు, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో నృత్య ప్రదర్శన ఇచ్చే అవకాశం లభించడం ఫణిన్మయి కళా ప్రస్థానంలో మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు కె. వివేకానందరెడ్డి, మన్యం వర్ధనరావు ప్రత్యేకంగా అభినందించారు.రావులపాలెం ప్రాంతానికి చెందిన నాట్యాచారిణి జాతీయస్థాయిలో కూచిపూడి నాట్యకళకు ప్రాతినిధ్యం వహించి ప్రశంసలు అందుకోవడంపై స్థానిక కళాభిమానులు, నృత్య గురువులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘనత రావులపాలెం ప్రాంతానికే కాకుండా ఆంధ్రప్రదేశ్ కూచిపూడి నృత్య సంప్రదాయానికి గర్వకారణంగా నిలిచిందని పలువురు కొనియాడారు.

మీరిచ్చిన సహకారం మీ చూపిన మమకారం!..





ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేనిది!..

మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు!..

వరరామచంద్రాపురం, నవంబర్ 6 (ప్రజాజ్యోతి ప్రతినిధి) ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ మమకారం, మీరిచ్చిన సహకారం, ఎన్ని జన్మలెత్తినా, ఋణం తీర్చుకోలేనిదని, మాదిరెడ్డి సత్తిబాబు, అన్నారు శుక్రవారం రేఖపల్లిలోని మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, అధ్యక్షుతన, వైఎస్ ఆర్సిపి సీనియర్ నాయకులు మాచర్ల గంగయ్య, ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు మాది రెడ్డి సత్తిబాబు, మాట్లాడుతూ, గురువారం జరిగిన జడ్పి. టి.సి, ఎం.పీ.టీ. సీ, ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన మండల ప్రజలకు, కృతజ్ఞతలు తెలియజేశారు. అలానే పోటీ చేసిన అభ్యర్థులతో పాటు మండల నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేశారని, అద్భుతమైన విజయాన్ని నమోదు చేస్తామని తెలి పారు. శనివారం, వెలువడనున్న ఫలితాలు వైఎస్ ఆర్సిపికి, అనుకూలంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన ప్రతి నాయకుడికి కార్యకర్తకి రానున్న రోజుల్లో మంచి రోజులు వస్తాయని ఆశా భావం వ్యక్తం చేశారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని, వివరించారు. ఈ కార్యక్రమంలో, వివిధ హోదాల్లో ఉన్న జిల్లా, నియోజక వర్గ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ విజయం వెనుక సరైన నిర్ణయం. నిరంతర శ్రమ



యువత ఉద్యోగాల కోసం కాకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి, డా. ఎం. అరీజ్ అహమ్మద్

బాపట్ల నవంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ఒకే విద్యాసంస్థలో చదువుకుంటూ, ఒకే లక్ష్యంతో ముందుకు సాగిన నలుగురు స్నేహితులు సివిల్ సర్వీసెస్‌లో ఉన్నత స్థానాలను సాధించిన అనుభవాన్ని అస్సాం ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డా. ఎం. అరీజ్ అహమ్మద్ విద్యార్థులతో పంచుకున్నారు. సరైన సమయంలో తీసుకున్న నిర్ణయం జీవిత గమనాన్ని మార్చగలదని, లక్ష్యంపై స్పష్టతతో పాటు కష్టపడే తత్వం ఉంటే అనుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన దీక్షారంభ కార్యక్రమంలో అతిథి ఉపన్యాసకులుగా పాల్గొని విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం చేశారు.న్యూఢిల్లీలోని ఐ.ఏ.ఆర్.ఐ.లో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో సీనియర్ ఇచ్చిన సలహాతో తాను, తన ముగ్గురు స్నేహితులు సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యామని, వారిలో ముగ్గురు ఐఏఎస్‌లుగా, ఒకరు ఐఎఫ్ఎస్ అధికారిగా ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలను గుర్తించి తగిన రంగాన్ని ఎంచుకోవాలని, నిర్ణయం తీసుకున్న తర్వాత దానిపైనే దృష్టి సారించి ముందుకు సాగాలని సూచించారు. విద్యార్హతలతో పాటు నైపుణ్యాలు కూడా ముఖ్యమని, యువత ఉద్యోగాన్వేషణకే పరిమితం కాకుండా వ్యవస్థాపకులుగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా ఆలోచించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా 1985 బ్యాచ్ పూర్వ విద్యార్థి, అస్సాం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్ డా. ఎం. అరీజ్ అహమ్మద్‌ను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. అసోసియేట్ డీన్ డా. పి. ప్రసూనా రాణి, అధ్యాపకులు డా. ఎస్.ఆర్. కోటేశ్వరరావు, డా. కె. శ్రీనివాసులు, డా. పి. అనిల్ కుమార్, డా. కె.ఎస్.ఆర్. పాల్, డా. ఎం. శ్రీరేఖ, డా. కె. చంద్రశేఖర్, డా. లాల్ అహమ్మద్ మొహమ్మద్, డా. ఎస్. హైమజ్యోతి, డా. కె. విజయ్ ప్రకాష్, డా. వి. సీతారాంబాబు, డా. డి. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల అభిమానం.. ఫయాజ్‌కు ఘన సన్మానం!

శాలువా కప్పి పూలమాలలతో సత్కరించిన 6వ వార్డు ప్రజలు



ప్రజా జ్యోతి నందికొట్కూరు ప్రజల అభిమానం, ఆత్మీయత మధ్య బైరాపురం ఫయాజ్‌కు ఘన సన్మానం లభించింది. నందికొట్కూరు మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ బీ. దిల్షాద్ భర్త అయిన ఫయాజ్‌ను వార్డుకు చెందిన పలువురు ప్రజలు ఆయన స్వగృహంలో కలిసి శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న ఫయాజ్‌కు వార్డు ప్రజలు ఈ విధంగా గౌరవం అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం, అందరితో కలుపుగోలుగా వ్యవహరించడం అభినందనీయమని పేర్కొన్నారు.తనపై చూపిన ప్రేమాభిమానాలకు ఫయాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని గౌరవిస్తూ, వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం వార్డు ప్రజల మధ్య ఆత్మీయతకు వేదికగా నిలిచింది.

బాల్యవివాహ రహిత జిల్లాగా అనంతపురాన్ని తీర్చిదిద్దడం మనందరి బాధ్యత

చైతన్య కళాశాలలో బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం

గుంతకల్లు నవంబర్ 6 (ప్రజా జ్యోతి): అనంతపు రం జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా రూపొందిం చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పిలుపుని చ్చారు. బాల్యవివాహాల వల్ల బాలబాలికల భవిష్య త్తు దెబ్బతింటుందని, వాటి నివారణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయా లని సూచించారు.కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి సాజిదా బేగం సూచనలతో శు క్రవారం గుంతకల్లులోని చైతన్య కళాశాలలో 'బాల్య వివాహ ముక్త్ భారత్-- 2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివా హ నిరోధక చట్టం, ఆంధ్రప్ర దేశ్ బాల్యవివాహ నిబంధ నలు, జీవో ఎంఎస్ నంబర్ 31, 39పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి మస్తాన్ రావు మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు, యువతీ యువకులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో బాల్యవివా హ నిరోధక చట్టం, దాని ప్రకారం విధించే శిక్షల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.వివాహాల సమయంలో వధూవరుల వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డును మాత్రమే ప్రామాణికంగా తీసుకోరా దని, జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాల ధ్రువీకరణ పత్రాలు లేదా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పుట్టిన తేదీ ఆధారంగా వయస్సు ను నిర్ధారించాలని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) మంజునాథ్ మాట్లాడుతూ బాల్యవివా హాల బాధితులు, బడి మానేసిన బాలబాలి కల వివరాలను జిల్లా విద్యాశా ఖాధికారి, స్కిల్ డెవలప్ మెంట్ అధికారులకు అందించి, వారికి నైపుణ్య శిక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించా రు. తద్వారా వారు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలకు బాల్యవివాహ నిరోధక చట్టం, బాలబాలి కల వివాహ వయస్సు, చట్టపరమైన శిక్షలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మండల, గ్రామ స్థాయిల్లో నిర్వహించాలని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమాలకు మహిళా శిశు సంక్షేమ శాఖ తరఫున అధికారులు కూడా హాజరవుతారని తెలిపారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ మాట్లాడుతూ అన్ని మతాలు, భాషలకు చెందిన ప్రజలకు సులభంగా అర్థమ య్యేలా వారి మాతృభాష ల్లో బాల్యవివాహ నిరోధక చట్టం, శిక్షల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సబిత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, శిశు గృహ మేనేజర్ భాగ్యలక్ష్మి, డబ్ల్యూఎంఎస్‌కే లావణ్య, విద్యార్థినీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

41వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి కృష్ణ నాయక్ టీడీపీ కూటమికి మద్దతు



గుంతకల్లు నవంబర్ 6 (ప్రజాజ్యోతి): శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వగృ హం ఆలూరులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు గుంతకల్లు మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి మరియు గుత్తి పామిడి మండలాల ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ సమక్షంలో గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలోని 41వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కృష్ణ నాయక్ తెలుగుదేశం పార్టీ కూటమి కి తన మద్దతు ప్రకటించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పసుపు కండువా తో సత్కరించి కృష్ణ నాయక్ ని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంతో 40 వ వార్డు కౌన్సిలర్ ప్రభాకర్, 42వ వార్డు కౌన్సిలర్ కేఎల్ శీనా, సీనియర్ నాయకులు రామ్ రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

పాము కాటుతో స్నేక్ క్యాచర్ పరిస్థితి విషయం.



దేవనకొండ ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి(రాఘవేంద్ర). దేవనకొండకు చెందిన ప్రముఖ స్నేక్ క్యాచర్. వికలాశీగా యూట్యూబర్ రామాంజ నేయులు అంజి) పాముకాటుకు గుర య్యారు. 4-5 అడుగుల పామును పట్టుకుంటుండగా అది కాటు వేయడం తో వెంటనే పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. పాములు పట్టేటప్పుడు బ్లౌజులు స్టిక్స్ వంటి ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడ మే ఈ ప్రమాదానికి కారణమని డాక్టర్ కల్పన పేర్కొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం.. సుస్థిర జీవనశైలిని అలవర్చుకుందాం!

నెల్లిపాక జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 'బ్రిక్స్ సేవ్ - రెడ్యూస్ ఈ-వేస్ట్' సదస్సు

నెల్లిపాక ఫారెస్ట్ రేంజ్ అధికారి సత్యనారాయణ మూర్తి పిలుపు

సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా నెల్లిపాక పాఠశాలలో అవగాహన కార్యక్రమం





ఎటపాక, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సుస్థిర జీవనశైలిని తమ దైనందిన జీవితంలో అలవర్చుకోవాలని నెల్లిపాక అటవీశాఖ రేంజ్ అధికారి సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా గురువారం నెల్లిపాక అటవీశాఖ పరిధిలోని నెల్లిపాక సెక్షన్, బీట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ-వ్యర్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. ఉపయోగం లేని మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, బ్యాటరీలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాలను విచ్చలవిడిగా పారవేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఈ-వ్యర్థాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. పాడైన మొబైల్ ఫోన్లను వెంటనే పారవేయకుండా మరమ్మతులు చేయించుకోవాలని, పాత కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను తిరిగి వినియోగించుకోవాలని సూచించారు. అవసరం లేని ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేయకుండా ఉండాలని, పాత బ్యాటరీలను సాధారణ చెత్తలో వేయకూడదని తెలిపారు. పాడైన టీవీలు, ఫ్రిజ్‌లు, ప్రింటర్లను గుర్తింపు పొందిన వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాలకు అప్పగించాలని చెప్పారు. అలాగే మొబైల్ ఛార్జర్లు, విద్యుత్ తీగలను జాగ్రత్తగా వినియోగించాలని పనిచేస్తున్న పాత ఎలక్ట్రానిక్ వస్తువులను అవసరమైన వారికి అందించాలని సూచించారు. పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ-వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చకూడదని, వాటి వల్ల వెలువడే హానికర పదార్థాలు గాలి, నేల, నీటిని కలుషితం చేస్తాయని వివరించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని, తమ కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల ప్రజలకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని కోరారు. ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగిస్తూ పర్యావరణ హితమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక అటవీశాఖ రేంజ్ అధికారి సత్యనారాయణ మూర్తి, అటవీశాఖ రేంజ్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ సమయంలో పటిష్ట బందోబస్తు. ఎస్పీ ఉమామహేశ్వర్ ప్రత్యేక చొరవ

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రశాంతంగా ముగింపు. పోలీస్ అధికారులు, సిబ్బందికి అభినందనలు



బాపట్ల నవంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుఫాను బీభత్సంతో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన జిల్లా పర్యటనకు బాపట్ల జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసింది. అతి తక్కువ సమయంలోనే పర్యటనకు అవసరమైన బందోబస్తును ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సూర్యలంక, ముత్తాయపాలెం, బాపట్ల పట్టణం, జమ్ములపాలెం, జిల్లెళ్లమూడి తదితర ప్రాంతాలను సందర్శించి, అనంతరం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రేటూరు పరిధిలో తుఫాను ప్రభావంతో నీటమునిగిన రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటించే మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, ఆయా ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని అవసరమైన విధుల్లో నియమించారు.సంప్రదాయ బందోబస్తుతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డ్రోన్ల ద్వారా పర్యటన ప్రాంతాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రశాంతంగా ముగిసింది.తక్కువ సమయంలోనే పకడ్బందీ ఏర్పాట్లు చేసి, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.

త్రిలింగేశ్వర దేవస్థానంలో వీరశైవులను కలిసిన చెన్న బసప్ప - రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి



కౌతాళం,నవంబర్ 06 ప్రజా జ్యోతి కౌతాళం రాబోయే సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఉరుకుంద ఈరన్న దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప కౌతాళం మండల కేంద్రంలోని శ్రీ త్రిలింగేశ్వర స్వామి దేవస్థానంలో వీరశైవులను కలిశారు.ఈ సందర్భంగా వీరశైవులతో సమావేశమైన చెన్న బసప్ప,రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి, ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి, దేవాలయాల అభివృద్ధికి తాను ఎప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో వీరశైవ పెద్దలు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ముఖ్యమంత్రి పర్యటనకు ఎస్పీ వకుల్ జిందాల్ భద్రతా ఏర్పాట్లు



గుంటూరు నవంబర్ 5 (ప్రజాజ్యోతి ప్రతినిధి) మురసు తుఫాను బీభత్సానికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేటూరు గ్రామానికి రానున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా పోలీస్ యంత్రాంగం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ స్వయంగా రంగంలోకి దిగి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకుమాను మండలంలోని పర్యటన ప్రాంతాలు, రాకపోకల మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పోలీస్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పర్యటన ఏర్పాట్లలో భాగంగా గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ ఐఏఎస్, బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఐపీఎస్ కూడా సమన్వయంతో వ్యవహరించారు. ముఖ్యమంత్రి సందర్శించే ప్రాంతాల్లో భద్రత, కాన్వాయ్ రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా డ్రోన్ల ద్వారా పర్యటన ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించేలా నిఘా ఏర్పాటు చేశారు.పర్యటన ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ ఏర్పాట్లలో సీసీఎస్ సుప్రజ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, సౌత్ డీఎస్పీ జి.పూర్ణచంద్ర రావు, ఇతర పోలీస్ అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న వరి పంటల పరిశీలన

--రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు



కాకినాడ జిల్లా నవంబర్ 6 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) అర్నాట్, మురసు తుఫాన్ల ప్రభావంతో నీట మునిగిన, నేలకొరిగిన వరి పంటలను ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత, వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని చిన్నచిన్న కాలువల ద్వారా బయటకు పంపించాలని సూచించారు. తెగుళ్లు సోకకుండా ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తడిచిన ధాన్యం మొలకెత్తకుండా, గింజల రంగు మారకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. సీతారామ శర్మ, డా. సుధీర్, డా. సుజాత, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఈఓ రేఖ, వీర అర్జున్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చీరాల మున్సిపల్ ఓట్ల లెక్కింపును పరిశీలించిన కలెక్టర్



చీరాల నవంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించి, ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు విధానాన్ని పరిశీలించిన కలెక్టర్.. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి దశలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి చిన్న పొరపాట్లు జరగకుండా లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ నెల ఒకటో తేదీన జరిగిన చీరాల పురపాలక ఎన్నికల ఓట్ల లెక్కింపు వాస్తవానికి నవంబర్ మూడో తేదీన జరగాల్సి ఉండగా, వర్షాల కారణంగా వాయిదా పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతితో శుక్రవారం కౌంటింగ్ నిర్వహించారు. చైర్మన్ పదవికి ఎనిమిది మంది, 44 వార్డులకు 163 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన అనంతరం సాధారణ ఓట్ల లెక్కింపు చేపట్టారు.కలెక్టర్ వెంట చీరాల ఆర్డీవో నరసింహారావు, పురపాలక కమిషనర్ కె. డానియేలు జోసెఫ్ తదితరులు ఉన్నారు.

నాపై నమ్మకం ఉంచిన వార్డు ప్రజల రుణం తీర్చుకుంటా

వార్డులో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



ప్రజా జ్యోతి నందికొట్కూరు తనపై నమ్మకం ఉంచి ఆదరాభిమానాలు చూపించిన 2వ వార్డు ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్డు ప్రజలు తనపై చూపించిన నమ్మకం, ప్రేమ, అభిమానాన్ని ఎప్పటికీ మరచిపోలేనని పేర్కొన్నారు.ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని బాధ్యతగా భావిస్తూ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. వార్డులో ఏ చిన్న సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానని, ప్రజల అవసరాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. పదవులు, రాజకీయాలు కంటే ప్రజల నమ్మకం, వారి ఆదరణ తనకు ముఖ్యమని తెలిపారు. తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజలు చూపిన అభిమానానికి అభివృద్ధి పనుల ద్వారా సమాధానం చెబుతానని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఘన స్వాగతం. సాదర వీడ్కోలు పలికిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి



బాపట్ల నవంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాలు, పంటలను పరిశీలించేందుకు శుక్రవారం బాపట్ల జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఘన స్వాగతం పలికారు. బాపట్ల మండలం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు.అనంతరం ముఖ్యమంత్రి జిల్లాలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను, నల్లమడ డ్రెయిన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత ప్రాంతాల పరిస్థితులను తెలుసుకుని, సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొని తుఫాన్ నష్టాలు, సహాయక చర్యలపై వివరాలు వెల్లడించారు. పర్యటన ముగించుకుని సాయంత్రం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు. సాయంత్రం ఐదు గంటల పది నిమిషాలకు ముఖ్యమంత్రి అమరావతికి బయలుదేరారు.ఈ కార్యక్రమంలో ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెనేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు,రామాంజనేయులు, వేగేశన నరేంద్రవర్మ రాజు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. కోటేశ్వరరావు, బావుడా చైర్మన్ ఎస్. రాజశేఖర్ బాబు, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఆర్డీఓ ఏ. హరికుమార్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండలో రేపే ఓట్ల లెక్కింపు. ఎవరికి పట్టం



దేవనకొండ ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి (రాఘవేంద్ర) దేవనకొండ మండలంలో జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలు 68.64 శాత0 నమోదు అయింది. ఓటర్ల తమ నిర్ణయాలను బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తం చేశారు. వర్షపాతం ప్రభావం వల్ల పట్టలు సరిగ్గా పండగ పోవడం వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు అప్పలపాలు గురవడం జరిగింది. దీనివల్ల గ్రామాల్లో ఉన్న ప్రజలు కూలి పనులు కోసం వలస పోవడం జరిగింది దీనివల్ల పోలింగ్ పై ప్రభావం చూపినట్లు తెలుస్తుంది గతంలో ఎంపీపీ జెడ్పిటిసి వైసిపి ప్రభుత్వం గెలుచుకోగా. ప్రస్తుతం కోటింగ్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రజలు ఎవరికి మద్దతు ఇచ్చారనేది దానిపై ఉత్కంఠ నెలకొంది. రేపు పత్తికొండలో లెక్కింపు జరుగునుంది.

ఓటు హక్కుతో పాటు సంక్షేమ పథకాలకూ ముప్పు

న్యూఢిల్లీ: ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆధార్ కార్డుకు బదులుగా ఓటర్ ఐడీ కార్డుతో అనుసంధానించాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాదని, పౌరుల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నమని ఆరోపించారు. ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకుని, అదే జాబితా ఆధారంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలా వద్దా అని నిర్ణయించే పరిస్థితి తీసుకురావాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

ఓటర్ ఐడీతో పథకాల అమలుపై అభ్యంతరం

ఆధార్ కార్డులకు బదులుగా బయోమెట్రిక్ వివరాలు, ఓటర్ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటూ కేంద్ర మంత్రి లలన్ సింగ్ మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ తన పోస్టుకు జత చేశారు. గల్లీకో సంస్థ ఐదు నిమిషాల్లోనే ఆధార్ కార్డులు తయారు చేసి ఇస్తోందని, అందుకే ప్రత్యామ్నాయ గుర్తింపు విధానాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి వ్యాఖ్యానించినట్లు ఆ వీడియోలో ఉంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఓటర్ల జాబితాలో పేరు లేని పేదలు సంక్షేమ పథకాల ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు అనేది పౌరుడి హక్కు మాత్రమేనని, పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చలేరని స్పష్టం చేశారు. ఈ హక్కుల చోరీని ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వబోమని పేర్కొన్నారు.

ఎస్ఐఆర్‌పై మరోసారి విమర్శలు

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో లక్షలాది మంది పేర్లను తొలగిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. బీజేపీని ఓడించాలని భావించే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగించే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. ఓటరు పేరు తొలగితే ఓటు హక్కు పోతుందని, తద్వారా ఇతర పౌర హక్కులపైనా ప్రభావం పడుతుందని అన్నారు. భవిష్యత్తులో రేషన్, పెన్షన్లు, ఉపాధి హామీ, ఇళ్లు, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్ల వంటి ప్రయోజనాలకూ ఓటర్ ఐడీని ప్రామాణికంగా చేస్తారా? అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా రాహుల్ విమర్శలు చేశారు. ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అయితే, ఇవన్నీ కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలుగా మాత్రమే చూడాలి.

కాలుష్య నివారణకు సంస్కరణలు అవసరం

మరోవైపు దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్రరూపం దాల్చుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ విశ్లేషణను ప్రస్తావిస్తూ.. కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం ప్రజారోగ్య సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రస్తుత విధానాలను సమీక్షించి, సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఓబీసీ క్రీమీలేయర్‌లో తల్లిదండ్రుల జీతం లెక్కించొద్దు!

న్యూఢిల్లీ: ఓబీసీ రిజర్వేషన్ అభ్యర్థుల క్రీమీలేయర్ స్థితిని నిర్ణయించే సమయంలో తల్లిదండ్రుల జీతాన్ని యాంత్రికంగా పరిగణనలోకి తీసుకోరాదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ, తీర్పులో మార్పులు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనను శుక్రవారం తిరస్కరించింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎస్ఈ--2025 అభ్యర్థులకూ వర్తింపు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ)--2025లో ఎంపికైన ఓబీసీ అభ్యర్థులకు సర్వీసుల కేటాయింపు విషయంలోనూ 2026 మార్చి 11న ఇచ్చిన తీర్పులోని సూత్రాలే వర్తిస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎంపికైన అభ్యర్థులకు పాత ప్రమాణాల ప్రకారం క్రీమీలేయర్ స్థితిని నిర్ణయించేందుకు అనుమతించాలని, మార్చి తీర్పు ప్రభావాన్ని గత తేదీల నుంచి అమలు చేయకుండా పరిమితం చేయాలని కేంద్రం అనుబంధ దరఖాస్తులు దాఖలు చేసింది. అయితే సర్వీసుల కేటాయింపు ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, మార్చి 11 నాటి తీర్పు అమలును వాయిదా వేయడానికి సహేతుకమైన కారణాలు లేవని కోర్టు పేర్కొంది. ఆ తీర్పులో వివరించిన క్రీమీలేయర్ సూత్రాల ప్రకారమే సీఎస్ఈ--2025 అభ్యర్థులకు సర్వీసుల కేటాయింపు జరగాలని స్పష్టం చేసింది.

కేసు నేపథ్యం ఇదీ..

సివిల్ సర్వీసెస్ పరీక్షలో అర్హత సాధించిన కొందరు ఓబీసీ అభ్యర్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేస్తున్నారనే కారణంతో క్రీమీలేయర్ పరిధిలోకి చేర్చారు. తల్లిదండ్రుల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని డీఓపీటీ ఈ నిర్ణయం తీసుకోవడంతో వారికి ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు దక్కలేదు. దీంతో బాధిత అభ్యర్థులు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. అనంతరం మద్రాస్, ఢిల్లీ, కేరళ హైకోర్టుల్లోనూ వారికి అనుకూలంగా తీర్పులు వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లను ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు కొట్టివేసింది. సంబంధిత అభ్యర్థులు, ఇంటర్వీనర్ల వాదనలను పరిశీలించి ఆరు నెలల్లోగా ఆదేశాలను అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

పాత నియామకాలకు మినహాయింపు

తాజా ఉత్తర్వుల్లో గత తీర్పు ప్రభావంపై కూడా ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే పూర్తయిన ఎంపికలు, నియామకాలు, సర్వీసుల కేటాయింపులను తిరిగి తెరవాల్సిన అవసరం లేదని తెలిపింది. దీనివల్ల ఇతర ఉద్యోగుల సీనియారిటీకి కూడా ఎలాంటి భంగం కలగదని పేర్కొంది. అయితే 1993 నాటి ఆఫీస్ మెమోరాండం, 2004లో జారీ చేసిన స్పష్టీకరణ లేఖకు సంబంధించి మార్చి తీర్పులో ఇచ్చిన అన్వయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం అందరికీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఇదే తరహా అంశాలపై ఇతర అభ్యర్థుల కేసులు కోర్టులు, ట్రైబ్యునళ్లు లేదా సంబంధిత అధికారుల వద్ద పెండింగ్‌లో ఉంటే, మార్చి తీర్పులోని సూత్రాలను పరిగణనలోకి తీసుకుని వాటి మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది.

దిల్లీని కమ్మేసిన కాలుష్యం.. గ్రాప్-3 ఆంక్షలు అమలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 390 దాటడంతో దిల్లీతో పాటు జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో తక్షణమే గ్రాప్-3 ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు అత్యవసరం కాని నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిస్థాయి నిషేధం విధించింది. వాహనాల రాకపోకలు, పారిశ్రామిక కార్యకలాపాలపైనా కఠిన ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చింది.

వాహనాలపై కఠిన ఆంక్షలు

గ్రాప్-3 నిబంధనల్లో భాగంగా బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్ల రాకపోకలను అధికారులు నియంత్రిస్తున్నారు. అంతర్రాష్ట్ర డీజిల్ బస్సులు దిల్లీలోకి ప్రవేశించడం, నగర పరిధిలో తిరగడంపైనా ఆంక్షలు విధించారు. కంకర రహదారులపై ఇసుక, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రి రవాణాను నిషేధించారు. స్వచ్ఛ ఇంధనంతో నడవని స్టోన్ క్రషర్లు, హాట్ మిక్స్ ప్లాంట్లను మూసివేయడంతో పాటు మైనింగ్ కార్యకలాపాలపైనా ఆంక్షలు అమలు చేస్తున్నారు. అత్యవసర, ఆవశ్యక సేవలకు మినహా డీజిల్ జనరేటర్ల వినియోగాన్ని నిలిపివేశారు. వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రైవేటు సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా హైబ్రిడ్ విధానాలను అనుసరించాలని అధికారులు సూచించారు. ఐదో తరగతి లోపు విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.

మెట్రో, బస్సు సర్వీసులు పెంపు

ప్రైవేటు వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు దిల్లీ మెట్రో రైలు సర్వీసుల ట్రిప్పులను పెంచింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులను కూడా రోడ్లపైకి తీసుకొచ్చారు. కాలుష్యం మరింత పెరిగి గ్రాప్-4 స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వాయు నాణ్యత మరింత క్షీణించకుండా అడ్డుకునేందుకు గ్రాప్-3 ఆంక్షలు కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.


టెన్షన్.. టెన్షన్.. అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ!

నేడే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు ఎటపాక జడ్పిటిసి స్థానంలో త్రిముఖ పోరు

మధ్యాహ్నానికల్లా తేలనున్న భవితవ్యం గెలుపు ఎవరిని వరిస్తుందోనని సర్వత్రా చర్చ!

పోలింగ్ ముగిసినప్పటి నుంచీ క్షణక్షణం భయం.. భయం

రేసులో స్వతంత్ర అభ్యర్థులు, వైఎస్ఆర్సీపీ, జనసేన, టీడీపీ-బీజేపీ కూటమి, వామపక్షాలు!



ఎటపాక, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): ఎప్పుడెప్పుడా అని యావత్ మండలం ఎదురుచూస్తున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల కీలక ఘట్టం రానే వచ్చింది. గత కొద్ది రోజులుగా సాగిన ఊహాగానాలు, లెక్కలు, అంచనాలకు నేటితో తెరపడనుంది. నేడు చింతూరులోని కౌంటింగ్ కేంద్రంలో జరగనున్న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనుంది. ఓటరు దేవుడు ఎవరికి పట్టం కట్టాడు? గెలుపు ఎవరిని వరిస్తుంది? ఓటమి ఎవరికి తప్పదు? అన్న ఉత్కంఠ అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజల్లోనూ పతాక స్థాయికి చేరింది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి గ్రామాలు, కూడళ్లలో సాగుతున్న అంచనాలు, రాజకీయ సమీకరణాలు నేడు వాస్తవరూపం దాల్చనున్నాయి. ఎటపాక మండల పరిధిలోని 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు అత్యంత ప్రతిష్టాత్మకమైన జడ్పీటీసీ స్థానానికి జరిగిన ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఎటపాకలో ఉత్కంఠ రేపుతున్న త్రిముఖ పోరు

ముఖ్యంగా ఎటపాక జడ్పీటీసీ స్థానంలో ముక్కోణపు పోటీ తీవ్రతరమైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న జడ్పీటీసీ కాక కామేశ్వరి, స్వతంత్రులుగా రంగంలోకి దిగిన పాయం దేవి, కూటమి మద్దతుతో ఉబ్బ సుస్మితల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఇటు అధికార పక్షం తమ సంక్షేమ పథకాలే తమను గట్టెక్కిస్తాయని ధీమాగా ఉండగా, అటు కూటమి శ్రేణులు ప్రజా వ్యతిరేకతే తమను గెలిపిస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం స్థానిక బలాలు, తమకున్న ప్రజాదరణతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో జడ్పీటీసీ ఎవరి వశం కానుందనేది అంతుచిక్కకుండా మారింది.

నువ్వా-నేనా అన్నట్లు ఎంపీటీసీల పోరు

ఇక మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాల్లోనూ ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేన, వైఎస్ఆర్సీపీ, బీజేపీతో పాటు సీపీఐ, సీపీఎం అభ్యర్థులు హోరాహోరీగా తలపడ్డారు. పలుచోట్ల స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వడంతో ఫలితాలు ఏ క్షణంలోనైనా తారుమారయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎవరికి వారు తామే విజేతలమంటూ లెక్కలు వేసుకుంటున్నా, లోలోపల మాత్రం అభ్యర్థుల్లో వణుకు పుడుతోంది.

69.80 శాతం పోలింగ్.. మహిళలదే పైచేయి!

ఎటపాక మండలంలో 12 ఎంపీటీసీ, 1 జడ్పీటీసీ స్థానానికి సంబంధించి మొత్తం 40 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. మండలంలో మొత్తం 33,634 మంది ఓటర్లు ఉండగా, వారిలో 23,490 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 11,258 మంది పురుషులు కాగా, 12,232 మంది మహిళలు ఉన్నారు. మొత్తం 69.80 శాతం పోలింగ్ నమోదైంది. పురుషుల ఓటింగ్ శాతం 69.50 కాగా, మహిళల ఓటింగ్ శాతం 70.20గా నమోదైంది. పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతగా నిలిచింది. ఈ పెరిగిన మహిళా ఓటింగ్ ఎవరి కొంపముంచుతుందో, ఎవరికి వరం అవుతుందోనని ప్రధాన పార్టీలు తెగ మథనపడుతున్నాయి.

గ్రామాల్లో చర్చల హోరు

పోలింగ్ ముగిసినప్పటి నుంచి మండలంలోని గ్రామాల్లో, టీ కొట్టుల వద్ద, రచ్చబండల దగ్గర ఫలితాలపైనే చర్చ సాగుతోంది. స్థానిక సమీకరణాలు, సామాజిక వర్గాల ఓటింగ్ సరళిని విశ్లేషిస్తూ బెట్టింగ్‌ల జోరు కూడా సాగుతున్నట్లు సమాచారం. గెలుపోటములపై భారీగా పందేలు కాస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

నేడు వీడనున్న ఉత్కంఠ.. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత!

ఈ రోజు ఉదయం నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫలితాల వెల్లడి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి కేవలం అనుమతి పత్రాలు ఉన్న ఏజెంట్లు, అభ్యర్థుల ను మాత్రమే అనుమతిస్తున్నారు. ఉదయం రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. మధ్యాహ్నానికల్లా పూర్తి స్థాయి ఫలితాలు వెలువడే అవకాశముండటంతో అభ్యర్థులు, వారి అనుచరులు కౌంటింగ్ కేంద్రాల వద్దకు, టీవీల ముందుకు చేరుకుంటున్నారు. నిమిష నిమిషానికి మారే అధిక్యతలతో మండల రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేగనుంది. చివరకు ప్రజా తీర్పు ఎవరిని వరిస్తుందో.. ఎవరి శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుందో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

ఇప్పపెంట గ్రామంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

చింతకొమ్మ దిన్నె ప్రజాపతి 06/11/26 సి.కె.దిన్నె మండలంలోని ఇప్పపెంట గ్రామంలో ఏరువాక కేంద్రం, కడప ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్.వి. వ్యవసాయ కళాశాల గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమ విద్యార్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస చారి మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకొని సాగు ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చి తగిన పరిష్కారాలు పొందాలని సూచించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్. కృష్ణప్రియ మాట్లాడుతూ రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించి లాభదాయకమైన సాగు చేపట్టాలని తెలిపారు. ఉటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కె. సునీల్ కుమార్ మాట్లాడుతూ వివిధ పంటల్లో చీడపీడల నివారణ, ఆధునిక సాగు పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ విధానాల గురించి వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలపై రైతులకు



అవగాహన కల్పించారు. కడప వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. నాగరాజు మాట్లాడుతూ పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, వానపాముల ఎరువు, జీవ ఎరువుల వినియోగం ద్వారా నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని నేలలోని పోషకాల స్థాయిని తెలుసుకోవాలని సూచించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువులను వినియోగించాలని, యూరియా, డీఏపీ, పొటాష్ వంటి రసాయన ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులోనే వాడాలని వివరించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల సహాయ ఆచార్యులు, కళాశాల సంచాలకుల ప్రతినిధి డాక్టర్ ఎన్. వాణి మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం ద్వారా విద్యార్థులు రైతులతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరచుకొని క్షేత్రస్థాయిలో వ్యవసాయ సమస్యలను తెలుసుకోవడంతో పాటు, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం



అభినందనీయమని తెలిపారు. కడప వ్యవసాయ శాఖ అధికారి సుచరిత రైతులకు అందుబాటులో ఉన్న వ్యవసాయ సాంకేతిక సేవలు, వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా నిర్వాహకులు ఎం. ప్రకాష్ సమాచార సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు వ్యవసాయ సలహాలు, సేవలు అందించడంలో సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై వివిధ నమూనాలు, ప్రదర్శనలు, పాత్రాభినయం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ ప్రదర్శనలో వివిధ పంటల సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, నూతన సాగు విధానాలను ప్రదర్శించారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, ఇప్పపెంట గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓట్లు లెక్కింపు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

దువ్వూరు,నవంబరు06 (ప్రజా జ్యోతి) ఎంపీటీసీ,జడ్పిటిసి ఓట్లు లెక్కింపునకు సంబంధించి నియమించిన సూపర్ వైజర్ల కు శుక్రవారం దువ్వూరు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్దిత సమయంలో పూర్తి చేయడంతో పాటు విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రతి అనుభవాన్ని ఒక పాఠంగా తీసు కుని, కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా నిర్వహించాలని సూచిం చారు.ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో విధులు నిర్వహించాలని, ప్రక్రియ సజావుగా, వేగంగా పూర్తయ్యేలా ఓట్లు లెక్కింపు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఎన్నికల కమిషనర్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో కౌంటింగ్ పూర్తయ్యేలా చూడాలని తగు సూచనలు,సలహా లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఓ రవిచంద్రబాబు, ఏఆర్ఓ జవహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

స్వతంత్ర సంస్థలకు రాజకీయ క్రిమీడ

ప్రజాస్వామ్యానికి కాపలాదారులు గా ఉండాల్సిన రాజ్యాంగ సంస్థలు పాలకుల రాజకీయ పంజరంలో బందీలైతే ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్టే! అధికారానికి ఊడిగం చేయడానికి కాదు సంస్థలున్నది.. రాజ్యాంగాన్ని కాపాడటానికే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు పెట్టడం, ఓట్లు లెక్కింపు, ఫలితాలు ప్రకటించడమే కాదు.. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించే వ్యవస్థలుగా ఉండాలి.పాలకుల నిర్ణయాలకు అడ్డుకట్ట వేయగల స్వతంత్రసంస్థలుగా ఉండాలి. అధికార దుర్వినియోగాన్ని నిలదీయగలగాలి. కానీ నేడు దేశంలో స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిపై జరుగుతున్న చర్చలు ప్రజాస్వా మ్యానికి పెను హెచ్చరికగా మారుతున్నా యి. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన చోట ప్రభుత్వ నీడలో నడుస్తున్నా యనే అనుమానాలు బలపడితే అది కేవలం ఒక సంస్థ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాద ఘంటిక.రాజ్యాంగ సంస్థలు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి ఏర్పడిన కార్యాలయాలు కావు. ప్రభుత్వ నిర్ణ యాలకు గుడ్డిగా తలూపే ముద్ర వేసే యంత్రాలు అంతకంటే కావు. ప్రజల ప్ర యోజనాలను, రాజ్యాంగ విలువలను కా పాడాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా నిర్ణ యాలు తీసుకుంటేనే స్వతంత్ర సంస్థలుగా గుర్తింపు వస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాన్ని చెప్పే ధైర్యం లేకపోతే ఆ సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉన్నట్టా? పాలకులే జవాబు చెప్పాలి. స్వతంత్రత అనేది ప్రభుత్వానికిచ్చే కానుక కాదు. అది ప్రజాస్వామ్యం కల్పించిన రాజ్యాంగ బాధ్యత.పథకాలు చూడండి2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. సామాన్య ప్ర జలు బ్యాంకుల ముందు క్యూలో నిలబడ్డారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపో యారు. పేదల జీవనాధారాలు దెబ్బతిన్నాయి. ఇంతటి కీలక నిర్ణయం విషయం లో రిజర్వ్ బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రభుత్వ నిర్ణయాన్ని లోతుగా పరిశీలించిందా? లేదా ముందే తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు కాపలాదారుగా ఉండాల్సిన కేంద్ర బ్యాంకు ప్రభుత్వ నిర్ణయాల ముందు స్వతంత్రతను కోల్పోతే సామాన్యుడి ఆర్థిక భద్రతకు దిక్కెవరు? ప్రభుత్వా నికి నచ్చిన నిర్ణయమే సరైనదని చెప్పే సంస్థకు స్వతంత్ర సంస్థ అనే పేరెందుకు? ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనది ఓటు. ఆ హక్కును కాపాడాల్సిన ది ఎన్నికల సంఘం. అది ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదు. అధికార పార్టీకి ఒక కొలమానం, ప్రతిపక్షానికి మరో కొలమానం ఉంటే అది నిష్పక్షపాత అనిపించుకోదు. ఎన్నికల కోడ్ అందరికీ సమానంగా వర్తించాలి. అధికార బలం, ధనబలం, రాజకీయ పలుకుబడి ఎన్నికల ను ప్రభావితం చేయకుండా చూడాలి. ఈసీ నిర్ణయాలపై ప్రజల్లో అనుమానాలు పెరగడం అంటే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం సన్నగిల్లుతుంది. స్వతంత్ర సంస్థల స్వేచ్ఛను దెబ్బతీసే మొదటి అడుగు వాటి నియామకాల నుం చే మొదలవుతుంది. కీలక పదవుల్లో ఎవరిని నియమిస్తున్నారు?వారి అర్హత ఏంటి? వారి ఎంపికలో పారదర్శకత ఉందా? రా జకీయ విధేయతకు ప్రాధాన్యతనిస్తున్నా రా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా రావాలి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులనే కీలక పదవుల్లో నియమిస్తే భవిష్యత్తులో ఆ సంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయనే నమ్మకం ఎలా కలుగుతుం ది? అందుకే నియామక ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం, పారదర్శ కత, అర్హతలకు ప్రాధాన్యముండాలి. సం స్థల పునాదులనే రాజకీయ ప్రయోజనాలతో కలుషితం చేస్తే వాటి నుంచి నిష్ప క్ష పాతాన్ని ఆశించడం పగటికలే అవుతుంది.స్వయంప్రతిపత్తి అంటే ప్రశ్నించడానికి వీల్లేని అధికారం కాదు. ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న పేరుతో సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీల్లేదు. అధికార దుర్వినియోగం జరిగినా, నిర్ణయాల్లో తప్పులు దొర్లినా, ప్రజా ప్ర యోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్య పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, న్యాయపరమైన పరిశీలనకు సంస్థలు జవాబు దారీగా ఉండాలి. కానీ ఈ పర్యవేక్షణ రాజకీయ కక్షసాధింపుకు ఆయుధంగా మార కూడదు. ప్రభుత్వ పెత్తనం ఒక ప్రమాదమైతే, జవాబుదారీతనం లేని స్వతంత్రత మరో ప్రమాదం. ఈ రెండింటి మధ్య రా జ్యాంగ సమతుల్యతే ప్రజాస్వామ్యానికి రక్షణ.దేశంలో అధికారాలు శాశ్వతం కావు. ప దవులు శాశ్వతం కావు. ప్రభుత్వాలు శాశ్వ తం కావు. కానీ రాజ్యాంగం శాశ్వత విలువలతో నిలబడాలి. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే తమకు అనుకూలంగా ఉన్నప్పుడు సంస్థల స్వతంత్రతను సమర్థిస్తూ, ప్రతికూల నిర్ణయాలు వచ్చినప్పుడు వా టిపై దాడి చేసే ద్వంద్వ వైఖరిని రాజకీయ పార్టీలు విడనాడాలి. ప్రజాస్వామ్యం అం టే పాలకుల ఇష్టమే చట్టం కాదు. ప్రజల హక్కులే దాని ప్రాణం. రాజ్యాంగ సంస్థలు పాలకుల కరతాళ ధ్వనులకు అనుగుణం గా పనిచేసే వేదికలుగా మారితే ప్రజాస్వా మ్యం కేవలం ఎన్నికల తంతుగా మిగిలిపోతుంది.రాజకీయాలు చూడండిఎన్నికల సంఘం కావచ్చు, రిజర్వ్ బ్యాంకు కావచ్చు, మరే ఇతర రాజ్యాంగ సంస్థ కావచ్చు.. వాటి విధేయత ప్రభుత్వాల పట్ల కాదు, రాజ్యాంగం పట్ల ఉండా లి. వాటి నిర్ణయాలకు ప్రాతిపదిక రాజకీ య ప్రయోజనాలు కాదు, ప్రజా ప్రయోజనాలు కావాలి. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలన కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విమర్శలను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడమే ప్రజాస్వామ్య పరిపక్వత. సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూసే పాలకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. అధికారం ప్రజలు ఇచ్చేది.. రాజ్యాంగం పరిమితులు విధించేది! స్వతంత్ర సంస్థలను బలహీనపరిస్తే చివరకు బలహీనమయ్యేది పాలకులు కాదు.. ప్రజాస్వామ్యమే

డిప్యూటీ మేయర్ బీజేపీ వర్సెస్ జనసేన





విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం కు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అద్భుతమైన ఫలితాలు సాధించడంతో ఇప్పుడు పదవుల పంపకాలపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్నది మూడు పార్టీల్లోనూ ఉత్కంఠ రేపుతోంది. విశాఖలో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి బలమైన పట్టు ఉంది. భారతీయ జనతా పార్టీకి కూడా కొన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉండగా, జనసేనకు సామాజిక సమీకరణల పరంగా ఓటు బ్యాంకు ఉంది. ఈ మూడు పార్టీల బలాలు కలవడంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 120 వార్డులకు గాను 98 స్థానాలను అధికారిక కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించినప్పటికీ, వారు కూటమికి చెందిన రెబల్స్ కావడం గమనార్హం. దీంతో కూటమి వైపు మొత్తం 106 మంది కార్పొరేటర్ల మద్దతు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ 13 స్థానాలతో ప్రతిపక్షంలో ఉండనుండగా, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకుంది.మేయర్ పదవి టీడీపీకి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానంపై బీజేపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. విశాఖలో తమకున్న రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మేయర్ పదవిని ఇవ్వాలని బీజేపీ గతంలోనే కోరినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో ఎంపీ స్థానం కూడా కేటాయించకపోవడంతో కనీసం డిప్యూటీ మేయర్ పదవైనా ఇవ్వాలని టీడీపీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పొరేటర్గా పోటీ చేశారని, ఆయనకు డిప్యూటీ మేయర్ అవకాశం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆయన పేరు ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా ఈ పదవి తమ పార్టీకి దక్కేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.మరోవైపు జనసేన కూడా డిప్యూటీ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకుంది. విశాఖలో 26 మంది కార్పొరేటర్లతో కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా ఉన్న తమకు ఈ అవకాశం ఇవ్వడం సమంజసమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కేవలం ఎనిమిది మంది కార్పొరేటర్లు ఉన్న బీజేపీకి కాకుండా, తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఇచ్చిన రాజకీయ హామీలను పరిగణనలోకి తీసుకుంటే తమకే అవకాశం వస్తుందని బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారు.ఉత్తరాంధ్ర రాజకీయ సమీకరణాలు కూడా ఈ పదవుల పంపకంలో కీలకంగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం, విజయనగరం కార్పొరేషన్లలో టీడీపీకి ప్రాధాన్యత దక్కగా, రాబోయే శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు అవకాశం కల్పించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవసరమైతే విజయనగరంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో విశాఖ మేయర్ పదవిని బీజేపీ గెలుచుకున్న చరిత్ర కూడా ఆ పార్టీ నేతలకు గుర్తుంది. ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానం దక్కితే నగర రాజకీయాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చని భావిస్తున్నారు. అయితే జనసేన కూడా తన బలాన్ని తక్కువగా అంచనా వేయకూడదని పట్టుబడుతోంది. దీంతో చివరకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ డిప్యూటీ మేయర్ పీఠం బీజేపీకి దక్కుతుందా? లేక జనసేన తన బలంతో ఆ స్థానాన్ని సాధించుకుంటుందా? అన్నది త్వరలో తేలనుంది. ముక్కా శ్రావణి. తమ కుటుంబం ముప్పై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉందని.. అందుకే తమకు ఈ అవకాశం దక్కిందన్నారు. కూటమి పార్టీల్లో అనుభవం ఉన్న నేతల సహకారంతో విశాఖపట్నాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానన్నారు.ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు.. ఆయన గతంలో కార్పొరేటర్గా పనిచేశారు. శ్రీవాణి వృత్తిరీత్యా ఫిజియో థెరపిస్ట్ కాగా.. ఆమె రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2015 నుంచి టీడీపీలో యాక్టివ్ అయ్యారు.. 2021 ఎన్నికల్లో 26వ వార్డు (అక్కయ్యపాలెం ప్రాంతం) నుంచి కార్పొరేటర్గా పోటీచేసి గెలుపొందారు. అలాగే ముక్కా శ్రావణి తన డివిజన్లో పనులకు సంబంధించి నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఇటీవల ఆమెకు టికెట్ ప్రకటించిన తర్వాత ఆ వీడియో సోషల్ మీడియాలో మళ్లీ చక్కర్లు కొట్టింది. వైరల్ అయిన వీడియోలో ఏదో ఒకరోజు తమకు టైం వస్తుందన్నారు.. చెప్పినట్లుగానే ఆమె విశాఖ నగరానికి మేయర్ అయ్యారు.అంతేకాదు కూటమి పార్టీల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటుతో కొంత గందరగోళం ఏర్పడింది. మొత్తం 120 వార్డుల్లో 246మంది స్వతంత్రులు పోటీచే శారు. కూటమి పార్టీల్లో కూడా రెబల్స్ పోటీచేసి గెలిచారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 36వ వార్డులో కొల్లి సింహాచలం (జనసేన పార్టీ రెబల్), . అగనంపూడి జోన్ 106 వార్డులో రామునాయుడు (జనసేన పార్టీ రెబల్) గెలుపొందారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం 73వ వార్డులో పెతకంశెట్టి శ్యాం సుధాకర్రావు (జనసేన పార్టీ రెబల్). 39, 41 వార్డుల్లో (టీడీపీ రెబల్స్) బత్తిన నవీన్, పంపాన రాజ్యలక్ష్మిలు విజయం సాధించారు. 118 వార్డులో (పెందుర్తి) టీడీపీ రెబల్ గంట్ల లక్ష్మి గెలిచారు.గాజువాక 86 వార్డులో కాకి గోవిందరెడ్డి (టీడీపీ రెబల్) బరిలో విజయాన్ని అందుకున్నారు. విశాఖపట్నం జీవీఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా.. ఇప్పుడు అందరి దృష్టి డిప్యూటీ మేయర్ పదవివైపు మళ్లింది. ఈ పదవి కూటమిలో ఏ పార్టీకి దక్కుతుందనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ మేయర్ రేసులో ప్రధానంగా విశాఖపట్నం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశరామరాజు పేరు వినిపిస్తుంగా.. ఆయన 54వ డివిజన్ నుంచి గెలిచారు. కూటమి పొత్తులో భాగంగా ఆయనకు పదవి ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ జనసేన పార్టీకి కనుక పదవి ఇస్తే.. రేసులో విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం పరిధిలోని 40 డివిజన్ నుంచి గెలిచిన భీశెట్టి వసంత లక్ష్మికి అవకాశం ఉందంటున్నారు. అయితే డిప్యూటీ మేయర్ పదవిపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

శరవేగంగా కుంభమేళ పనులు



భోపాల్ : దేశంలో ప్రయాగ్రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభ మేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్తో పాటు త్రయంబకేశ్వ ర్లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్లోని రామ్కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోంది.వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్లో 45, త్రయంబకేశ్వర్లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళాతో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునికీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడవున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తున్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆ ప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీటర్ల పొడవున మురుగునీటి పైప్లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడతాయి.మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమతుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్-త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుందని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ

హైదరాబాద్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు. ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎండ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన వంతెనలు, మెట్రో స్కైవాక్ అనుసంధాన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. వీటితోపాటు ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు.ప్రాజెక్టులో భాగంగా కొన్ని కీలక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం నూతన భవనాన్ని నిర్మించారు. కాజీపేట వైపు కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. దక్షిణం వైపు స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రాకపోకల విభాగాలు, ప్రయాణికుల రాక, బయలుదేరే ప్రాంతాల నిర్మాణం పూర్తయింది. దక్షిణం వైపు బేస్‌మెంట్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైలు, మెట్రో, రోడ్డు రవాణా మధ్య అనుసంధానం మరింత మెరుగుపడటంతోపాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి లభించనుంది.



కనిపించని అధికార పార్టీ ప్రభావం

వరంగల్ : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి. ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అఖా స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.



భాగ్యనగర్‌లో నీటి కష్టాలు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది.హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యా సంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి జరుపుకోండి

కాంగ్రెస్ నాయకులకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ సూచన

హైదరాబాద్ ఈ నెల 8వ తేదీన దీపావళి రోజున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అంత ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ చేసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పేరుతో గతంలో ఎన్నడూ లేని విదంగా పేదలకు కొత్త ఇల్లు ఇవ్వడం జరిగింది ఇది వారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చే సందర్భం .. ఈ ఆనందాన్ని వారితో పంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల కల నెరిన సమయంలో వారితో దీపావళి జరుపుకోవాలని కోరుతున్నాము. గ్రామాల్లో రెండు దఫాలలో ఇల్లు ఇవ్వడం జరిగింది. హైదరాబాద్ లక్ష ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. కొన్ని ఇళ్లలో గృహ ప్రవేశాలు.కూడా జరిగాయి..ఇది నభూతో న భవిష్యత్ ఇలాంటి పండుగను మనం ఘనంగా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకోవాలని.విజ్ఞప్తి చేస్తున్నానని అయన అన్నారు.

వరంగల్‌లో భారీగా కల్తీ కారం, పసుపు పొడి పట్టివేత.. 2,250 కిలోలు స్వాధీనం

వరంగల్ : నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీపై అధికారులు కొరడా ఝళిపించారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీగా కల్తీ కారం, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కరీమాబాద్‌కు చెందిన ఆకుతోట గోపిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 2,250 కిలోల కల్తీ కారం, పసుపు పొడిని అధికారులు పట్టుకోగా, వీటి విలువ సుమారు రూ.5.92 లక్షలుగా అంచనా వేశారు. ఎలాంటి లైసెన్స్, లేబుల్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పొడులను ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై అధికారులు చర్యలు చేపట్టారు.

ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్

కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

జనగామ : తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ వుంటుందని కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఉద్యమకారుడు, సొంత పార్టీ నాయకుడు ఆత్మహత్య చేసుకుని మరణిస్తే కనీసం పట్టించుకోని బీఆర్ఎస్, అలాంటిది ఉద్యమ పార్టీ అని చెప్పుకోవడం విడ్డూరమని అన్నారు. బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల లక్ష్మణ్ గౌడ్ . బీఆర్ఎస్ పార్టీ కోసం అప్పు చేసి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అప్పులు తీర్చలేక, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఎలాంటి సహాయం అందకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు, ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అయన అందజేసారు. ఎన్నికల్లో లక్ష్మణ్ గౌడ్‌ను వాడుకుని లబ్ధిపొంది, నేడు కనీసం ఆయన కుటుంబాన్ని కూడా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించలేదని అయన విమర్శించారు.

అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం

నల్గొండ : నల్గొండ జిల్లాకు చెందిన యువతి అమెరికా లో మిస్సింగ్ అయింది. కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామం నుంచి యాదగిరిరెడ్డి?రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లింది. ఓ కళాశాలలో చదువుతూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదయింది. పోలీసులు గాలింపులు చేసట్టారు. ఒక్కగానొక్క కుమార్తె అమెరికాలో అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులు సంయమనంతో ఉండాలి

ఉయ్యూరు టౌన్ సీఐ ఎఎ రామారావు

ఉయ్యూరు టౌన్ ఎన్నికల ఫలితాల అనంతరం పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యర్థుల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చడం, వారిని గేలి చేయడం వంటి ఘటనలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి చర్యల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తామని టౌన్ సీఐ ఎఎ రామారావు హెచ్చరించారు "ప్రజలు మీపై నమ్మకం పెట్టుకుని గెలిపించారు. ఆ నమ్మకానికి తగిన హుందాతనంతో ప్రవర్తించాలని, ప్రత్యర్థుల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చడం, గేలి చేయడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం వంటి చిల్లర పనులు మానుకోవాలని హితవు పలికారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇతరులను రెచ్చగొట్టి పట్టణ ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు

మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !

కరీంనగర్ : రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయంలో పార్టీ కేవలం జాతీయ స్థాయి పార్టీగానే కాకుండా, అధికార బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాలు సాధించడంతో పాటు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఊహించని విధంగా ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకుని సంచలనం సృష్టించింది. సంజయ్ అనుసరించిన దూకుడు రాజకీయ శైలి, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేసే తీరు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాయి.అయితే, ఆయన దూకుడుతో పార్టీలో అంతర్గతంగా కొంత అసంతృప్తి చెలరేగడం, కొందరు సీనియర్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఆయనను ఆ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతూ వచ్చాయి.ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, రాష్ట్రంలో పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలన్నా, కేడర్‌లో ఉత్సాహం రావాలన్నా బండి సంజయ్ లాంటి దూకుడుగల నాయకుడే కచ్చితంగా అవసరమని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న సునీల్ బన్సాల్ తదితర పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అధ్యక్ష మార్పుపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే, ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని మళ్లీ బండి సంజయ్‌కే కట్టబెట్టాలనే ప్రతిపాదనపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఒకవేళ బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పగ్గాలు దక్కితే తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యకర్తలతో నేరుగా కనెక్ట్ అయ్యే నాయకుడిగా పేరున్న సంజయ్ రాకతో పార్టీ కేడర్‌లో మళ్ళీ కొత్త జోష్ వస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై, వైఫల్యాలపై పోరాటాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌కు పగ్గాలు ఇవ్వడం ద్వారా పార్టీ సామాజిక వర్గాల సమీకరణలోనూ బలపడే అవకాశం ఉందనే అంచనాలున్నాయి.మొత్తానికి రాబోయే స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ హైకమాండ్ తీసుకునే ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది

ఓలా, ఉబర్ లకు దీటుగా విన్ గ్రూప్



హైదరాబాద్ : తెలంగాణలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబరు 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విన్‌గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో కార్యకలాపాలు ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో స్థానికంగా కార్యకలాపాల విస్తరణపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ కిలోమీటర్‌కు రూ.9 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ప్రయాణ ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరలు మారుతుంటాయి. ఈ సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. మరోవైపు ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాస్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. ఉదాహరణకు రోజుకు రూ.3 వేల గ్రాస్ ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్ కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ కింద రూ.100 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోంది. పెట్రోల్, సీఎన్‌జీ కోసం రూ.700 నుంచి రూ.900, నిర్వహణ, టోల్ ఛార్జీల కోసం మరో రూ.200 నుంచి రూ.300 ఖర్చవుతున్నాయి. ఇవన్నీ పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే డ్రైవర్‌కు మిగులుతున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలకు క్యాబ్ సేవలు అందిస్తే ప్రయాణికులు అటువైపు మళ్లే అవకాశం ఉందని డ్రైవర్లు భావిస్తున్నారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. కొత్త సంస్థ తక్కువ ఛార్జీలతో మార్కెట్‌లోకి వస్తే ఈ భారీ డ్రైవర్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఓలా, ఉబెర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే వెసులుబాటు కలిగి ఉన్నారు. కానీ గ్రీన్ ఎస్ఎం విధానంలో డ్రైవర్లను సంస్థ నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్ణీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించనున్నట్లు తెలుస్తోంది.ఢిల్లీలో సంస్థ కార్యకలాపాల తరహాలో హైదరాబాద్‌లోనూ తొలి విడతలో వెయ్యి కార్లను ప్రవేశపెడితే ఒక్కో వాహనానికి ఒకటి లేదా రెండు షిఫ్టుల చొప్పున సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది డ్రైవర్లు అవసరమవుతారని అంచనా. సంస్థ సొంతంగా డ్రైవర్లను నియమించుకునే విధానం అనుసరించనుంది. ఢిల్లీ కార్యకలాపాలకు సంబంధించి రోజుకు 12 గంటలు పనిచేస్తే నెలకు రూ.35 వేల జీతం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆదాయాన్ని పొందేందుకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్లలో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయడానికి వీల్లేదు. ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు ఈ నిబంధనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో లేక సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

నాగార్జునసాగర్ వరదకాల్వలో విష రసాయనాలు..?



నల్గొండ : నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు రంగు మారడం, జలచరాలు చనిపోయి తేలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్లతో రసాయనాలు పారబోసినట్లు అనుమానిస్తున్నారు. ఈ కాల్వ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగు, సాగునీరు అందుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు కాల్వను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్లను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రసాయనాల స్వరూపం, నీటిపై వాటి ప్రభావం ఇంకా తెలియాల్సి ఉంది.నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు అకస్మాత్తుగా రంగు మారడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ట్యాంకర్ల ద్వారా కాల్వలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనాలు కలవడంతో కాల్వలోని నీటి రంగు మారడమే కాకుండా.. జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో పరిస్థితి తీవ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది. నాగార్జునసాగర్ వరదకాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన నీటి వనరులో గుర్తుతెలియని రసాయనాలు కలవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల అవసరాల దృష్ట్యా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నీటి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, కాల్వలో కలిసిన రసాయనాలు ఏంటి, వాటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. దాదాపు అర కిలోమీటరు మేర కాల్వను పర్యవేక్షించారు. కోదాడ?జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో, కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.మరోవైపు.. కాల్వలో రసాయనాలు పారబోసిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వరదకాల్వ వెంట గస్తీని పెంచడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి ట్యాంకర్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్దవూర ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. రసాయనాలను ఎవరు, ఎందుకు పారబోశారనే కోణంలో దర్యాప్తు కొనసా గుతోంది. తాగు, సాగునీటికి ఉపయోగించే జలవనరుల్లో రసాయన వ్యర్థాలను పారబోయడం ప్రజారోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటి వనరుల పరిసరాల్లో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేస్తామని చెబుతున్నారు.

కాంగ్రెస్ లో మారని తీరు



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీది అధికారంలో ఉన్నా, లేకపోయినా ఒకటే తీరు. అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న స్పృహ కూడా నేతల్లో లేకపోవడం విచారకరం. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ దీనికి మినహాయింపు కాదు.తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు బహిరంగంగా రగులుతున్నాయి. ఎన్ని సార్లు క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చినప్పటికీ ఫలితం మాత్రం లేదు. ఇంకా కుమ్ములాటలు, కొట్లాటలు, విమర్శలు, ప్రతి విమర్శలతో తమకు తామే పార్టీని నాశనం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తూ పదవులను పొందిన వారే ఈ పనులకు పాల్పడుతుంటంతో హస్తం పార్టీని ఎవరూ రక్షించలేరన్నది అర్థమయింది. ప్రజలకు చికాకు కలిగించేలా వీరి పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి. ఢిల్లీలో జరిగిన 'ఓట్ చోరీ' ర్యాలీ సమయంలో మంత్రి కి, ఎమ్మెల్యే కు మధ్య ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తదితర పదవుల నియామకాల విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుందని చెబుతన్నారు. దీంతో మంత్రిపై టీపీసీసీ నాయకత్వానికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పీసీసీ పరిధిలో విచారణ జరుపుతున్నారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ పరువు బజారున పడినట్లయింది. గాంధీ భవన్ లో నేత అంటే ఓర్పు, సంయమనం పాటించాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు కొట్లాటలకు దిగడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారనుంది. పార్టీలో క్రమశిక్షణ లోపానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నది పార్టీ నేతలే అంటున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 కోట్ల అభివృద్ధి బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా నిధుల కేటాయింపులు, టెండర్ల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో గిరిజన మహిళా నేత సస్పెన్షన్‌పై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి, పార్టీలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి విభేదాలను సరిదిద్దుతామని తెలిపారు. మరోవైపు ఈ అంతర్గత కుమ్ములాటల వల్ల పరిపాలన గాడి తప్పుతోందని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి

వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరె

మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్.. మరో నిందితుడి కోసం గాలింపు

సంగారెడ్డి జిల్లాలో మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించిన సంగారెడ్డి పోలీసులు

ఎయిర్ పిస్టల్ (నకిలీ తుపాకీ), 2-కత్తులు, నేరాలకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, ఇతర వస్తువులు స్వాధీనం

నిందితులపై మహారాష్ట్రలో గతంలోనూ పలు దొంగతనాలు, దోపిడీ కేసులు నమోదు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి : జిల్లాలో నమోదైన వరుస దారి దోపిడీ కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఆదేశాల మేరకు సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టి, జిల్లాలో నమోదైన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 65 పై జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించడం జరిగింది. ఈ కేసులకు సంబంధించి మహారాష్ట్రకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ముగ్గురు నేరస్తులు నేరం చేయడానికై మహారాష్ట్ర నుంచి యమహా బ్లూ కలర్ నెంబర్ ప్లేట్ లేని బైక్ పై బయలుదేరి నల్లని మాస్క్, స్వెట్టర్ లు, 2-కత్తులు బ్యాగ్ లో పెట్టుకొని, మరో వ్యక్తి ఎయిర్ పిస్టల్ ను కనబడకుండా దాచి పెట్టుకొని, తెలంగాణ వైపు వస్తుండగా, చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్గి చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని యమహా బ్లూ కలర్ ఆర్ 15 బైక్ పై అనుమానాస్పదంగా కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, సంగారెడ్డి జిల్లాలో జరిగిన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని హుమ్నాబాద్‌లో జరిగిన మరో దారి దోపిడీ కేసులో తమ ప్రమేయాన్ని వెల్లడించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. చెన్నూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదలు, కార్మికులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతి అర్హుడికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే మా బాధ్యత. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా నిరంతర లక్ష్యమని అన్నారు.

మరో భర్త హతం

ప్రియుడి మోజులో పడి భర్తను హతమార్చిన భార్య

జయశంకర్ భూపాలపల్లి : భార్య చేతిలో హత్యకు గురయిన జాబితాలో మరో భర్త చేరాడు. గొల్లబుద్ధారం గ్రామంలో సంతోష్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని, భార్య పావనిభర్త అజ్మీర చందు (30)ను హతమార్చింది. ప్రియుడితో కలిసి హత్య చేసి, ఎడ్లబండిపై మృతదేహాన్ని చికెన్‌పల్లి సమీపంలో నిందితురాలు పడేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న ప్రియుడు సంతోష్, భార్య పావని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సివిల్ సప్లై అధికారుల తనిఖీలు..

ధరల పట్టిక ప్రదర్శించాలని ఆదేశాలు

హైదరాబాద్ : సివిల్ సప్లై అధికారులు శుక్రవారం నాడు మెహిదీపట్నం లో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అధికారిణి బుష్రా సుల్తానా నేపధ్యంలో ఈ తనిఖీలు జరిగాయి. నిత్యావసర వస్తువుల అమ్మాకాలను అధికారుల బృందం పరిశీలించింది. పలు దుకాణాల్లోని సరకులకు వున్న రేట్ లేబుళ్లను తొలగించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. ఖచ్చితంగా ప్రభుత్వ ధరలకే అమ్మకాలు చేయాలని అన్నారు.

భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన ఏఆర్ కానిస్టేబుల్

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలం పట్టణంలో ఒక ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యను హతమార్చి గోదావరి లో పడేసాడు. కానిస్టేబుల్ నరేందర్ ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యనే హత్య చేసాడు. నరేందర్ కు భవాని సోషల్ మీడియా ద్వారా పరిచయమైయింది. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఎనిమిది నెలల క్రితం పాప జన్మించగా ఆ తర్వాత చిన్నారి చనిపోయింది. తరువాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో నరేందర్ భార్యను హతమార్చి మృతదేహాన్ని గోదావరిలో పడేసాడు. విషయం తెలిసిన పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో భవాని మృతదేహం కోసం గాలిస్తున్నారు. భార్యను హత్య చేయడానికి దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ కష్టాలు

కరీంనగర్ : పొద్దంతా బొగ్గు గనుల్లో కష్టపడి.. చెమటోడ్చి.. సింగరేణి సంస్థ అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన కార్మికులు.. ఇప్పుడు రిటైర్మెంట్ తర్వాత తమ కనీస అవసరాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధాప్యంలో కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన నెలవారీ పెన్షన్.. వారి పాలిట పెను సమస్యగా మారుతోంది. ప్రతి నెల ఒకటో తేదీన ఖాతాల్లో జమ కావాల్సిన పెన్షన్.. గురువారం వరకు కూడా పలువురు రిటైర్డ్ కార్మికులకు అందకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దీపావళి పండుగ వేళ.. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన సమయంలో పెన్షన్ అందకపోవడం వారి బాధను మరింత పెంచుతోంది. ఇంటి ఖర్చులు.. మందులు.. నిత్యావసరాలు.. ఇలా ప్రతి అవసరానికి పెన్షన్‌పైనే ఆధారపడే వృద్ధ కార్మికులు ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.సీఎంపీఎఫ్ కార్యాలయాల్లో వేల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని చెబుతున్నప్పటికీ.. పెన్షన్ చెల్లింపుల్లో తరచూ జాప్యం ఎందుకు జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆలస్యానికి కారణాలు వెల్లడించకపోవడం.. అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడం రిటైర్డ్ కార్మికుల్లో మరింత అసంతృప్తిని పెంచుతోంది.కార్మికుల సంక్షేమమే లక్ష్యమని చెబుతున్న ప్రభుత్వాలు.. పెన్షన్ సమస్యపై ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు తమ సమస్యలను పరిష్కరించడంలో కార్మిక సంఘాలు కూడా తగిన చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.పెన్షన్ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతూ.. అధికారుల కార్యాలయాల వద్ద ఎదురుచూస్తూ.. తమ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్న రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులు తమ ఆవేదనను ప్రజా క్రాంతి దృష్టికి తీసుకొచ్చారు.

ఎల్ నీనో ప్రభావం...

ఆరుతడి పంటలు వేయండి

సర్పంచ్ ప్రతిమ,ఏ.ఈ.ఓ అరవింద్.

కమాన్ పూర్ : ఎల్ నీనో ప్రభావం... ఆరుతడి పంటలు వేయలని సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు, రామగిరి ఏ.ఈ.ఓ గుడికందుల. అరవింద్ అన్నారు. రామగిరి మండలం రత్నపూర్ రైతు వేదికలో రైతులకు ఆరుతడి పంటల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . వారు మాట్లాడుతూ ఎల్ నీ నో ప్రభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. పెసల్లు,నువ్వులు, మినుములు, కుసుమలు వంటి పంటలు సాగు చేయాలని సూచించారు. అలాగే రైతులకు ఆయిల్ ఫామ్ సాగు గురించి తెలియజేస్తూ ఆయిల్ ఫామ్ లో వస్తున్న సబ్సిడీ ల గురించి వివరించారు. అవగాహన కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బిజినెస్

అతడు లోన్ ఎగ్గొడితే.. మీరు కట్టాల్సిందేనా?

గ్యారంటీ సంతకం చేసే ముందు ఈ విషయాలు తెలుసుకోండి!



స్నేహితుడో, బంధువో బ్యాంకు లోన్ తీసుకోవాలనుకున్నప్పుడు అర్హతలు సరిపోక మీ సాయం కోరవచ్చు. గ్యారంటీగా సంతకం చేయాలని అడగవచ్చు. వారి మీద నమ్మకంతో చాలామంది వెంటనే అంగీకరిస్తుంటారు. కానీ ఈ నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. ఎందుకంటే రుణానికి హామీదారుగా సంతకం చేయడం అంటే కేవలం స్నేహితుడికి సాయం చేయడం మాత్రమే కాదు.. అతడు లోన్ వాయిదాలు చెల్లించకపోతే ఆ బాధ్యతను మీరూ స్వీకరించడమే. భారత్‌లో రుణ హామీ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత, రుణగ్రహీత చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకు మిమ్మల్ని కూడా బాధ్యులుగా చేయవచ్చు.

మీ సేవింగ్స్‌కూ ముప్పు

రుణగ్రహీత వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే, ఒప్పంద నిబంధనల ప్రకారం బ్యాంకు బకాయి మొత్తాన్ని మీ నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ఈ పరిణామం మీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అత్యవసర అవసరాల కోసం దాచుకున్న డబ్బు, భవిష్యత్తు ఖర్చుల కోసం కూడబెట్టిన సొమ్ము కూడా లోన్ చెల్లింపులకు వినియోగించాల్సి రావచ్చు. బకాయిలు అలాగే ఉంటే బ్యాంకు చట్టపరమైన చర్యలకూ దిగవచ్చు. కొన్ని పరిస్థితుల్లో మీ ఆస్తులకూ ముప్పు ఏర్పడవచ్చు.

మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినొచ్చు

మీరు తీసుకోని లోన్ కారణంగా మీ క్రెడిట్ హిస్టరీపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ప్రధాన రుణగ్రహీత వాయిదాలు సకాలంలో చెల్లించకపోయినా, లోన్ ఎగవేసినా ఆ వివరాలు క్రెడిట్ సమాచార సంస్థలకు చేరే అవకాశం ఉంది. దీంతో మీ క్రెడిట్ స్కోర్ తగ్గవచ్చు. భవిష్యత్తులో వ్యక్తిగత రుణం, గృహ రుణం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు మీ క్రెడిట్ హిస్టరీని పరిశీలిస్తాయి. అప్పుడు మీరు ఇప్పటివరకు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినా, హామీ ఇచ్చిన లోన్ ప్రతికూలతలు మీపై ప్రభావం చూపవచ్చు.

భవిష్యత్తులో మీకు రుణం రావడం కష్టమవుతుందా?

మరొకరి లోన్‌కు హామీగా నిలవడం మీ భవిష్యత్తు రుణ అర్హతపైనా ప్రభావం చూపవచ్చు. ఆ హామీని బ్యాంకులు మీపై ఉన్న ఆర్థిక బాధ్యతగా పరిగణించే అవకాశం ఉంది. మీరు సొంతంగా ఇల్లు కొనాలనుకున్నా, కారు తీసుకోవాలనుకున్నా లేదా వ్యక్తిగత అవసరాల కోసం రుణం కోరినా ఈ అంశాన్ని పరిశీలించవచ్చు. హామీగా ఉన్న మొత్తం ఎక్కువైతే, మీకు మంజూరయ్యే రుణ పరిమితి తగ్గే అవకాశముంది.

హామీ ఇచ్చే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రుణానికి గ్యారంటీగా సంతకం చేసే ముందు ఒప్పందాన్ని పూర్తిగా చదవాలి. రుణగ్రహీత చెల్లించకపోతే మీపై పడే బాధ్యత ఎంత? వడ్డీ, ఆలస్య రుసుములు, జరిమానాలు సహా ఎంత మొత్తం చెల్లించాల్సి రావచ్చు? ఏ పరిస్థితుల్లో బ్యాంకు మీ నుంచి డబ్బు వసూలు చేయవచ్చు? వంటి అంశాలను స్పష్టంగా తెలుసుకోవాలి. రుణం తీసుకుంటున్న వ్యక్తి ఆదాయం ఎంత? ఇప్పటికే ఇతర రుణాలు ఉన్నాయా? గతంలో వాయిదాలను సక్రమంగా చెల్లించారా? అన్న విషయాలనూ పరిశీలించాలి. స్నేహితులు, బంధువులకు ఆర్థికంగా అండగా నిలవడం మంచి విషయమే. అయితే ఆ సాయం మీకు భారంగా మారకూడదు. రుణగ్రహీత చెల్లించకపోతే మొత్తం బకాయిని మీరే చెల్లించగలరా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోండి. ఆ బాధ్యతను భరించే పరిస్థితి లేకపోతే గ్యారంటీగా సంతకం చేయకపోవడమే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు..

ట్రిలియన్ డాలర్లు కోల్పోయిన టెకీ కంపెనీలు



న్యూయార్క్: అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు జయకేతనం ఎగురవేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ దేశ స్టాక్‌మార్కెట్ల లో ట్రిలియన్ల డాలర్లు ఆవిరైపోతున్నాయి. అమెరికా, యూరోప్, ఆసియా దేశాల్లోని టెకీ సంస్థలపై మిడ్‌టర్మ్ ఫలితాలు దారుణమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ మందగిస్తుందన్న భయాందోళనల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికాలో నాస్‌డాక్ షేర్లు 5.5 శాతం పడిపోయాయి. దీంతో సుమారు 2.5 ట్రిలియన్ల డాలర్ల మార్కెట్ నష్టపోయినట్లు తెలుస్తోంది. నాస్‌డాక్‌తో పాటు ఇతర అమెరికా స్టాక్ ఇండెక్స్‌ల్లోనూ భారీ పతనం నమోదు అయ్యింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆంక్షలు కఠినం చేసే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటును డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఏఐపై పెట్టుబడి పెట్టేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెకీ కంపెనీల షేర్లు షేక్ అయ్యాయి. ఏఐపై భారీగా పెట్టుబడి పెడితే, దానికి తగిన లాభాలు వస్తాయా రావా అన్న ఆలోచనల్లో మదుపరులు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో మ్యాగ్నిఫిషియంట్ సెవన్ టెకీ కంపెనీల్లో భాగమైన యాపిల్, ఎన్‌విడియా, టెస్లా కంపెనీలు ట్రేడింగ్‌లో ట్రిలియన్ డాలర్లు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఎన్‌విడియా కంపెనీ షేర్లు 9 శాతం పడిపోయాయి. ఇతర చిప్ తయారీ కంపెనీలు కూడా ఇబ్బందిపడ్డాయి. ఏఎండీ, మైక్రాన్ కంపెనీల షేర్లు దాదాపు 17 శాతం కుప్పకూలాయి. బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల్లో షేర్లు 8, 11 శాతం పడిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు కంపెనీలకు చెందిన సుమారు 300 బిలియన్ల డాలర్ల మార్కెట్ వాల్యూ పడిపోయింది. రిపబ్లికన్ పార్టీ ప్రచారం కోసం మస్క్ సుమారు 450 మిలియన్ల డాలర్లు ఖర్చు చేశారు. దీంట్లో టెక్సాస్ సేనేట్ అభ్యర్థి కెన్ పాక్స్‌టన్ కోసం 45 మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టారు. కానీ అక్కడ డెమోక్రటిక్ అభ్యర్థి గెలుపొందారు. యురోప్‌కు చెందిన టెకీ కంపెనీ, చిప్‌మేకర్ ఇన్‌ఫినియాన్ షేర్లు కూడా 8.5 శాతం పడిపోయాయి. ఇక టెకీ ఎక్విప్మెంట్ తయారీ సంస్థ ఏఎస్ఎంఎల్ కంపెనీ షేర్లు 6.5 శాతం తగ్గాయి. శుక్రవారం ఏషియన్ మార్కెట్లు కూడా వణికిపోయాయి. జపాన్‌లో నిక్కీ షేర్ ఇండెక్స్ 6 శాతం పడిపోయింది. మెమోరీ చిప్ తయారీ సంస్థలు కియాక్సియా, టోక్యో ఎలక్ట్రాన్ కంపెనీ షేర్లు భారీగా పతనం అయ్యాయి. దక్షిణ కొరియాలో చిప్‌మేకర్ ఎస్‌కే హైనిక్స్ 10 శాతం, శాంసంగ్ 6.4 శాతం షేర్లు డౌనయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఖర్చులపై భయాందోళనల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కుదేలు అయినట్లు మార్కెట్‌వాచ్ నిపుణుడు బ్రిట్నీ నుయెన్ తెలిపారు.

మానవాభివృద్ధి లేని ఆర్థిక వృద్ధి!

ఒక దేశం లేదా ప్రాంతం ఆర్థికంగా ఎంత బలపడింది, జీడీపీ వృద్ధి రేటు ఎంత పెరిగింది అనే లెక్కలే నేడు అభివృద్ధికి ప్రామాణికంగా మారుతున్నాయి. అయితే, కేవలం ఆర్థిక సంపద గణాంకాలే ప్రగతికి గీటురాయి కాలేవని ఆర్థిక రంగ నిపుణులు ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్నారు. మానవాభివృద్ధిని విస్మరించి కేవలం అంకెలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకునే ఆర్థిక వృద్ధి అస్థిరమైనది మాత్రమే కాదు, పూర్తిగా అనైతికం కూడా. ఆర్థిక వ్యవస్థ ఎంత రిచ్‌గా ఉందన్నది ముఖ్యం కాదు, మనుషులు ఎంత సుఖంగా జీవిస్తున్నారు అనేదే అసలైన అభివృద్ధికి కొలమానం అని నిపుణులు చెబుతున్నారు.

డబ్బు ప్రాముఖ్యత – పరిమితులు

ఆధునిక సమాజంలో మనుగడ సాగించడానికి, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి డబ్బు అత్యంత కీలకం. కనీస జీవన ప్రమాణాలు, మంచి విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, నివాసం పొందడానికి ఆర్థిక స్థోమత ఎంతో అవసరం. అయితే, డబ్బు కేవలం ఒక సాధనం మాత్రమే కానీ అదే గమ్యస్థానం కాకూడదు. ఆర్థిక సంపద కొందరు వ్యక్తులు, కొన్ని వ్యవస్థల వద్ద కేంద్రీకృతమవడం వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఒకవైపు వేల కోట్లు పోగేసుకునే వర్గం ఉండగా, మరోవైపు కనీస భోజనానికి నోచుకోని కోట్లాది మంది నిరుపేదలు ఉండటం స్థిరత్వం లేని ఆర్థిక విధానాలకు నిదర్శనం. కేవలం పరిశ్రమలు, ఐటీ రంగాలు, స్టాక్ మార్కెట్ సూచీలు పెరిగినంత మాత్రాన ప్రజల జీవితాలు బాగుపడినట్లు కాదు. ఆ సంపద ఫలాలు సమాజంలోని పేద వర్గాలకు, సామాన్యులకు ఏ మేర చేరుతున్నాయనేదే ముఖ్యం. మానవ వనరులపై పెట్టుబడి పెట్టని ఏ ప్రభుత్వ విధానమైనా దీర్ఘకాలంలో విఫలం కావాల్సిందే. ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ వంటి నోబెల్ గ్రహీతలు ఎప్పుడూ 'సామర్థ్యాల అభివృద్ధి'



గురించే మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక వనరులు ఉండటంతో పాటు వాటిని ఉపయోగించుకునే స్వేచ్ఛ, ఆరోగ్యం, విద్య ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆర్థిక వృద్ధి అనేది మానవుడి శ్రేయస్సును పెంచే సాధనంగా పనిచేయాలి తప్ప, మానవుడిని కేవలం ఆర్థిక వృద్ధికి ఒక వస్తువుగా లేదా సాధనంగా చూడకూడదు. సమాజంలో ఆర్థికాభివృద్ధికి, మానవ వికాసానికి మధ్య సమతుల్యత లోపించినప్పుడు నిరుద్యోగం, పేదరికం, మానసిక ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. కేవలం భౌతిక సంపద వెంట పరుగులు పెట్టడం మాని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన జీవనం, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన బతుకును అందించే సమగ్ర విధానాల వైపు అడుగులు వేయాలి. సంపద సృష్టితో పాటు మానవ విలువలకు పెద్దపీట వేసినప్పుడే దేశంగా ప్రగతి పథంలో పయనిస్తుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?

2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయ పడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు. భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు. వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు. మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మళ్లీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

స్పోర్ట్స్

పాపం బాబర్ ఆజమ్..
ఫామ్ కోసం దేశవాళీకి వస్తే
అక్కడా అదే కథ! ఔటై బ్యాట్‌ను బాదేశాడు!




పాపం బాబర్ ఆజమ్.. ఫామ్ అందుకోవాలని దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెడితే అక్కడా నిరాశే ఎదురైంది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు కాస్త పరుగులు చేసి ఆత్మవిశ్వాసం పెంచుకుందామనుకున్న పాక్ స్టార్‌కు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ చుక్కెదురైంది. స్వల్ప పరుగులకే పెవిలియన్ బాట పట్టాల్సి వచ్చింది. దీంతో మైదానంలోనే అసహనం బయటపెట్టాడు. ఔటై డ్రెస్సింగ్ రూమ్‌కు వెళుతూ బ్యాట్‌ను నేలకేసి కొట్టాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాకిస్థాన్ దేశవాళీ టోర్నీ ఖైద్-ఎ-ఆజమ్ ట్రోఫీలో లాహోర్ వైట్స్ తరఫున బాబర్ ఆడుతున్నాడు. ఫటా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగులే చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లోనైనా భారీ స్కోరు సాధిస్తాడని అభిమానులు ఆశిస్తే.. 42 పరుగులకే ఔటయ్యాడు. 77 బంతులు ఎదుర్కొన్న బాబర్.. షాహిద్ అజీజ్ వేసిన బంతిని వదిలేయాల్సింది పోయి క్లిక్ చేశాడు. ఆఫ్ స్టంప్‌కు చాలా దూరంగా వెళ్లిన బంతిని శరీరానికి దూరంగా ఆడటంతో బ్యాట్ అంచుకు తగిలి ఫస్ట్ స్లిప్‌లో క్యాచ్‌గా మారింది. అంతే.. మరోసారి పెవిలియన్ దారి పట్టాల్సి వచ్చింది. ఈసారి మాత్రం నిరాశను దాచుకోలేక బ్యాట్‌ను నేలపై బలంగా కొట్టాడు. ఇక మ్యాచ్‌లోనూ లాహోర్‌కు చేదు అనుభవమే ఎదురైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఫటా 362 పరుగులు చేసింది. ఫవాద్ అర్షద్ 115 పరుగులతో రాణించాడు. లాహోర్ తొలి ఇన్నింగ్స్‌లో 234 పరుగులకే ఆలౌటైంది. అలీ జర్యాబ్ 51 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ ఫరూక్ 123 పరుగులతో చెలరేగడంతో ఫటా 283 పరుగులు సాధించింది. దీంతో లాహోర్ ముందు 412 పరుగుల లక్ష్యం నిలిచింది. కానీ ఆ జట్టు 170 పరుగులకే కుప్పకూలింది. ఫటా 241 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు బాబర్‌కు మరో దేశవాళీ మ్యాచ్ ఆడే అవకాశం కూడా లేదు. ఈ నెల 9 నుంచి రావల్పిండిలో శ్రీలంకతో పాకిస్థాన్ తొలి టెస్టు ఆడనుంది. మరి దేశవాళీ క్రికెట్‌లో పరుగుల కోసం తంటాలు పడుతున్న బాబర్.. అంతర్జాతీయ టెస్టు వేదికపై అయినా తన బ్యాట్‌కు పని చెబుతాడేమో చూడాలి!

ఆర్యావీర్ సెహ్వాగ్, లక్ష్య రాయిచందానీ హాఫ్ సెంచరీలు.. ఆసియా అండర్-19లో భారత్ బోణీ

మస్కట్: అండర్-19 ఆసియాకప్‌లో ఇండియా బోణీ కొట్టింది. ఇవాళ ఒమన్‌లోని మస్కట్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు 10 వికెట్ తేడాతో విజయం సాధించింది. 129 పరుగుల లక్ష్యాన్ని కేవలం 19.1 ఓవర్లలో అందుకున్నది. ఓపెనర్లు ఆర్యవీర్ సెహ్వాగ్ చెలరేగి ఆడాడు. వీరేంద్ర సెహ్వాగ్ తనయుడైన ఆర్యవీర్.. కేవలం 52 బంతుల్లో 70 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు బౌండరీలు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఇక మరో ఓపెనర్ లక్ష్య రాయిచెందాని 63 బంతుల్లో 53 రన్స్ చేసి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విక్టరీతో ఇండియా తన పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నేపాల్ 42.3 ఓవర్లలో కేవలం 138 రన్స్ మాత్రమే స్కోరు చేసి ఆలౌటైంది.నేపాల్ జట్టులో దర్శ్ సోనార్ అత్యధికంగా 43 రన్స్ చేశాడు. భారత బౌలర్లలో అర్జున్ రాజ్‌పుత్, ఇషాన్ సూద్‌లు చెరి మూడేసి వికెట్లు తీసుకున్నారు.





‘రామాయణ’పై మహేష్ బాబు ప్రశంసలు.. ‘వారణాసి’లో శ్రీరాముడిగా ఎలా కనిపిస్తారోనని చర్చ..!

సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా ‘రామాయణం’ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ భారీ పౌరాణిక చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్, నటీనటుల అభినయం, భారీ నిర్మాణ విలువలపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, అట్లీ వంటి పలువురు ఈ చిత్రాన్ని మెచ్చుకోగా.. తాజాగా మహేష్ బాబు కూడా తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ‘రామాయణ’ పార్ట్-1 సినిమా చూసిన మహేష్ బాబు.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన పురాణ గాథను ఇంత అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవిల నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇంత భారీ స్థాయిలో సినిమాను నిర్మించడానికి కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ‘రామాయణ’ చిత్ర బృందం మొత్తం అభినందనలకు అర్హులని మహేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఆయన తదుపరి చిత్రం ‘వారణాసి’ గురించి కూడా చర్చకు దారితీసింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ఈ భారీ చిత్రం సోషియో ఫాంటసీ, టైమ్ ట్రావెల్, మైథలాజికల్ అంశాల కలయికతో రూపొందుతోంది. ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ అత్యంత కీలకంగా ఉండనుంది. ఈ చిత్రంలో మహేష్ బాబు తొలిసారిగా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణ ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. రాముడి పాత్ర కోసం మహేష్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. మహేష్ బాబును శ్రీరాముడి పాత్రలో చూపించేందుకు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. లుక్ టెస్ట్ సమయంలో మహేష్‌ను రాముడి గెటప్‌లో చూసి తాను ఆశ్చర్యపోయానని గతంలో రాజమౌళి వెల్లడించారు. దీంతో ‘వారణాసి’లో మహేష్ రాముడి అవతారంలో ఎలా కనిపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.ఇక ‘రామాయణం’ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, మహేష్ బాబు రాముడి పాత్రలో ఎలా మెప్పిస్తారనే చర్చ మొదలైంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే పౌరాణిక పాత్రలో కనిపించనుండటంతో అభిమానులు ఈ రెండు చిత్రాలపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు.

విజయ్ సేతుపతికి అరుదైన గౌరవం.. తొలి భారతీయ నటుడిగా ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేదికపై చరిత్ర!




తమిళ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకోబోతున్నారు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను మెప్పిస్తున్న ఆయన ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినీ ప్రతిభకు ప్రతినిధిగా నిలవబోతున్నారు. ప్రతిష్ఠాత్మక 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించే అవకాశం విజయ్ సేతుపతికి దక్కింది. ఈ ఘనత సాధించనున్న తొలి భారతీయ నటుడిగా ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డులను అందిస్తారు. ఈ ఏడాది 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుక నవంబర్ 23, 2026న న్యూయార్క్‌లో జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు పాల్గొనే ఈ వేడుకలో అవార్డులు అందించే ప్రెజెంటర్లలో విజయ్ సేతుపతి కూడా ఉండనున్నారు. భారతీయ నటుడికి ఇలాంటి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు దక్కడం సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. గతంలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా 2016లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్‌స్టన్‌తో కలిసి అవార్డును అందించారు. అయితే ప్రైమ్‌టైమ్ ఎమ్మీ, ఇంటర్నేషనల్ ఎమ్మీ రెండూ వేర్వేరు అవార్డుల వేడుకలు. ఇప్పుడు విజయ్ సేతుపతికి ఇంటర్నేషనల్ ఎమ్మీ వేదికపై ప్రెజెంటర్‌గా అవకాశం రావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

సూర్య ‘సీన్’ ఓటీటీ రిలీజ్ టైం ఫిక్స్ నెట్‌ఫ్లిక్స్‌లో ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ కానుందంటే!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య మరోసారి పోలీస్ ఆఫీసర్ పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ ‘సీన్’ దీపావళి కానుకగా నవంబర్ 6న థియేటర్లలో విడుదలైంది. ‘ఆవేశం’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు జిత్తు మాధవన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చాలా కాలం తర్వాత సూర్య పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. థియేటర్లలో విడుదలైన ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీపై అభిమానులు ఆరా తీస్తున్నారు. ‘సీన్’ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. సాధారణంగా థియేటర్లలో విడుదలైన సినిమాలు నాలుగు నుంచి ఆరు వారాల తర్వాత ఓటీటీలోకి వస్తున్నాయి. ఇదే విధానాన్ని అనుసరిస్తే ‘సీన్’ సినిమా డిసెంబర్‌లో డిజిటల్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా డిసెంబర్ మొదటి వారం లేదా మూడో వారంలో స్ట్రీమింగ్ కావచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఓటీటీ విడుదల తేదీపై నెట్‌ఫ్లిక్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. థియేటర్లలో సినిమా ప్రదర్శన, ప్రేక్షకుల స్పందనను బట్టి విడుదల తేదీలో మార్పులు ఉండవచ్చు. ఈ సినిమాలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ నటించారు. వీరిద్దరి కలయిక సినిమాపై ప్రత్యేక ఆసక్తిని పెంచింది. అంతేకాకుండా నస్లేన్, లాల్, ఆనందరాజ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సుశిన్ శ్యామ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరమ్ స్టూడియోస్ బ్యానర్లపై సూర్య, జ్యోతిక సంయుక్తంగా నిర్మించారు. యాక్షన్‌తో పాటు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అంశాలను మేళవించి దర్శకుడు ఈ సినిమాను రూపొందించారు. సీన్ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ సినిమాలో సూర్య ఇన్బరాజ్ అనే పోలీస్ అధికారిగా కనిపించారు. పోలీస్ శాఖలో మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్న ఇన్బరాజ్ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల తన ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. అయితే గతంలో ఆయన పరిష్కరించకుండా వదిలేసిన ఒక కేసు మరోసారి తెరపైకి వస్తుంది. దీంతో ఆ కేసును ఎలాగైనా పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతుంది.ఈ నేపథ్యంలో ఇన్బరాజ్ మరోసారి కేసు దర్యాప్తులోకి దిగాల్సి వస్తుంది. అయితే ఈసారి ఆయనకు ఎదురయ్యే పరిస్థితులు అంత సులభంగా ఉండవు. సమస్యాత్మకమైన, గందరగోళమైన ఓ పోలీస్ బృందంతో కలిసి దర్యాప్తు కొనసాగించాల్సి వస్తుంది. గతంలో పరిష్కారం కాని ఆ కేసు వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి? పాత కేసుకు, ఇప్పుడు ఎదురైన పరిణామాలకు ఉన్న సంబంధం ఏంటి? మంచి పేరున్న సిన్సియర్ పోలీస్ అధికారి ఇన్బరాజ్ ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశాడు? చివరకు ఈ కేసును ఎలా పరిష్కరించాడు? అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉండనుంది.

కళ్లకు కూలింగ్ గ్లాసెస్.. బ్లాక్ అవుట్‌ఫిట్‌లో కీర్తి సురేశ్ అదిరిపోయే లుక్



బాలయ్య ‘దాదా’లో క్రేజీ ఐటెం సాంగ్.. థమన్ ఈసారి కూడా మాస్ బీట్‌తో దుమ్ములేపనున్నాడా?



నందమూరి నటసింహం బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ‘దాదా’ ఒకటి. గతంలో బాలయ్యతో ‘వీరసింహారెడ్డి’ వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్ణయించిన సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం కష్టపడుతోంది. మరోవైపు ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న ఎస్.ఎస్. థమన్ విషయంలోనూ అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలో ఓ అదిరిపోయే ఐటెం సాంగ్ ఉండబోతుందనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణ, థమన్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా థమన్ అందించే బాణీలు థియేటర్లలో అభిమానులతో విజిల్స్ వేయిస్తుంటాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాల్లో పాటలు మంచి ఆదరణ పొందడంతో ‘దాదా’పై కూడా సంగీతం విషయంలో అంచనాలు పెరిగాయి. ఇప్పటికే బాలకృష్ణ సినిమాల్లో ఐటెం సాంగ్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా థమన్ అందించే బీట్స్ ఈ పాటలకు మరింత ఊపునిస్తుంటాయి. ఇప్పుడు ‘దాదా’ సినిమాలో కూడా ఓ ప్రత్యేకమైన ఐటెం సాంగ్ ఉండబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ పాట కోసం థమన్ అదిరిపోయే మాస్ బీట్స్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రత్యేక పాటలో బాలయ్యతో కలిసి స్టెప్పులు వేసే బ్యూటీ ఎవరనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతంలో బాలయ్య సినిమాల్లో ప్రత్యేక పాటలు చేసిన హీరోయిన్ల తరహాలో ఈసారి కూడా ఓ క్రేజీ హీరోయిన్‌ను తీసుకురాబోతున్నారా? అనే చర్చ జరుగుతోంది. అయితే ఈ పాటలో నటించబోయే హీరోయిన్ ఎవరు? పాట చిత్రీకరణ ఎప్పుడు జరగనుంది? అనే విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,